



చైత్రమాస వసంత నవరాత్రుల ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ

ఉగాది ఉత్సవం



ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జరిగిన వేడుకల్లో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుతో సీఎం చంద్రబాబు



దుర్గగుడిలో దక్షిణోత్తర నృత్య ప్రదర్శన

శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఆదివారం అంగరంగ వైభవంగా జరిగాయి. ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర దేవస్థానంలో చైత్రమాస వసంత నవరాత్రులను పురస్కరించుకుని దుర్గమ్మ పుష్పార్చనలు ప్రారంభమయ్యాయి. తొలి రోజున మల్లెలు, మరువంతో లలితా సహస్రనామాన్ని పారాయణ చేస్తూ అమ్మవారికి సమర్పించారు. సాయంత్రం వెండి రథంపై గంగాపార్వతీ సమేత మల్లేశ్వరుల ఉత్సవమూర్తుల ఊరేగింపు భక్తిపారవశ్యంతో సాగింది. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉగాదిని పురస్కరించుకుని వివిధ రంగాల ప్రముఖులను రాష్ట్ర ప్రభుత్వం తరపున హంస పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్ నిర్వహించిన ఉగాది వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడుతో కలిసి వేడుకలను తిలకించారు.

6లో



తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన ఉగాది వేడుకలకు హాజరైన సీఎం చంద్రబాబు, మంత్రులు దుర్గేశ్, పార్థసారథి, రాం నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు బొండా ఉమా, బుద్ధప్రసాద్, సీఎస్ విజయానంద్ తదితరులు

కరకష్టం

రామలింగేశ్వరనగర్ కరకట్టకు ప్రమాదం!

యథేచ్ఛగా ఇసుక లోడ్‌తో టిప్పర్లు, ట్రాక్టర్ల రాకపోకలు

శ్మశానం కూడలి నుంచి ఇస్కాన్ ఆలయం వరకు కుంగిన రోడ్డు



రామలింగేశ్వరనగర్ కట్టపై అదనపు లోడుతో వెళ్తున్న ఇసుక టిప్పర్

టిప్పర్ వెనుక టిప్పర్. ట్రాక్టర్ వెనుక ట్రాక్టర్. ఉదయం నుంచి రాత్రి వరకు ఇదే పరిస్థితి. చూస్తుంటే టిప్పర్లు, ట్రాక్టర్ల ర్యాలీ జరుగుతుందా అనిపిస్తోంది. ఇదీ రామలింగేశ్వరనగర్ కరకట్టపై నిత్యం కనిపిస్తున్న పరిస్థితి. కృష్ణా జిల్లా నుంచి అడ్డూ అదుపు లేకుండా వస్తున్న ట్రాక్టర్లు, టిప్పర్లు కరకట్టను కుంగదీస్తున్నాయి. వాహనదారులను ప్రమాదాల బారిన పడేస్తున్నాయి. రెండు జిల్లాల అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం, కృష్ణాజిల్లా అధికారులు మచిలీపట్నం వరకే పరిమితం కావడంతో సరిహద్దుల్లో ఇసుక మాఫియా రెచ్చిపోతోంది. విశ్రాంతి లేకుండా పగలు, రాత్రి నిర్విరామంగా ఇసుకను తరలించేస్తున్నారు. దీంతో కరకట్ట కుంగులోంది. నిత్యం కరకట్ట మీద నుంచి 40-60 టిప్పర్లు, ట్రాక్టర్లు మితిమీరిన బరువుతో తిరగడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది.

- రహదారిపై జారిపడి పోతున్న ఇసుక
- అదుపు తప్పుతున్న ద్విచక్ర వాహనాలు
- పట్టించుకోని కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అధికారులు



రోడ్డుపై ప్రమాదకరంగా ఇసుక

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కృష్ణాజిల్లాలో రొయ్యూరు, మద్దూరు, చోడవరం గ్రామాల్లో కృష్ణానదిలో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. ఇక్కడి నుంచి టిప్పర్లు, ట్రాక్టర్లు ఇసుకను గుంటూరు జిల్లాలోకి తరలిస్తున్నారు. ఈ రీచ్‌ల నుంచి ఇసుక లోడుతో వెళ్లే వాహనాలకు కరకట్టపై ప్రవేశం లేదు. అయినా ఈ నిబంధనను ఉల్లంఘించి టిప్పర్ల యజమానులు అధిక లోడుతో వాటిని కరకట్టపై తిప్పుతున్నారు. వాస్తవానికి ఈ టిప్పర్లు, ట్రాక్టర్లు బందరు రోడ్డు మీద నుంచి జాతీయ రహదారి మీదుగా గమ్యస్థానాలకు చేరుకోవాలి. దీనివల్ల డీజిల్ ఎక్కువగా ఖర్చవుతుంది. అదే అవనిగడ్డ కరకట్ట మీద నుంచి రాకపోకలు సాగిస్తే నేరుగా విజయవాడ స్క్రూబ్రిడ్జి వద్ద జాతీయ రహదారి ఎక్కవచ్చు. జాతీయ రహదారి చేరుకోవడానికి ఇది దగ్గర మార్గం. అవనిగడ్డ కరకట్టపై అవనిగడ్డ వైపు మిగతా 6లో..

టోల్‌గేట్‌లా మారిన ట్రాఫిక్ బూత్

ఇసుక రీచ్‌ల నుంచి మితిమీరిన సామర్థ్యంతో టిప్పర్లు తిరుగుతున్నా కృష్ణాజిల్లా రవాణా శాఖ అధికారులు తమకు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి వాహనాల సామర్థ్యం, అందులో వేయాల్సిన లోడ్ సామర్థ్యాన్ని పరిశీలించే అధికారం రవాణా శాఖ అధికారులకు ఉంటుంది. కరకట్టను కుంగదీస్తూ టిప్పర్లు, ట్రాక్టర్లు తిరుగుతున్నా ఇప్పటి వరకు అక్కడి రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేసిన దాఖలాలు ఎక్కడా కనిపించలేదు. చోడవరం వైపు నుంచి వస్తున్న టిప్పర్లు, ట్రాక్టర్లకు స్క్రూబ్రిడ్జి వద్ద ఉన్న ట్రాఫిక్ బూత్ మినీ టోల్‌ప్లాజాలా మారింది. అవనిగడ్డ కరకట్ట వైపు నుంచి గుంటూరు వైపు జాతీయ రహదారి మీదకు వచ్చే ప్రతి టిప్పరు, ట్రాక్టరు ఇస్కాన్ టెంపుల్ దాటిన తర్వాత ట్రాఫిక్ బూత్ ఎదురుగా ఆగిపోతాయి. వాటిలో నుంచి డ్రైవర్లు దిగి నేరుగా బూత్‌లోకి వెళ్తారు. నిమిషాల వ్యవధిలో వెనక్కి వచ్చి జాతీయ రహదారి మీదుగా వెళ్లిపోతారు. ఈ నిమిషాల వ్యవధిలో బూత్‌లో ఏం జరిగిందన్నది టిప్పర్ల డ్రైవర్లు, పోలీసులకు మాత్రమే తెలుసు.

బెట్టింగ్ కింగ్ ఎక్కడ?

పీపీ కోసం విస్తృతంగా గాలింపు

- ఐదుగురికి 41ఏ నోటీసులు జారీ చేసిన పోలీసులు
- ఈ బెట్టింగ్ బాగోతంలో పెరగనున్న నిందితుల సంఖ్య



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): అవనిగడ్డ కేంద్రంగా విజయవాడ నుంచి బెట్టింగ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్న కేసులో ప్రధాన నిందితుడు ప్రసాద్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇప్పటికే ఈ కేసులో ఐదుగురు నిందితులను అరెస్టు చేసిన విషయం తెలిసిందే. అవనిగడ్డ ఎంపీపీ తుంగల సుమతీదేవి కుమారుడు పవన్ కుమార్, చెన్నా గోపయ్య స్వామి, కమ్మిలి వెంకటరమణ, కోట నాగేశ్వరరావు, కృష్ణలంకకు చెందిన ఉమామహేశ్వరరావుకు పటమట పోలీసులు ఆదివారం 41ఏ నోటీసులు ఇచ్చారు. వారి ఖాతాల్లో ఉన్న రూ.48లక్షల లావాదేవీలపై పోలీసులు కూపీలాగుతున్నారు. ఈ ఐదుగురితో ప్రసాద్ బెట్టింగ్ వ్యవహారాన్ని నడిపిస్తున్నట్టు ఇప్పటికే పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం ప్రసాద్ సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుని ఉన్నాడు. నిందితుల సెల్‌ఫోన్లను సీజ్ చేసి సాంకేతికంగా విశ్లేషిస్తున్నారు. నిందితులు పార్కర్ ఎక్స్ఛేంజ్ యాప్ ద్వారా పందేలు నిర్వహిస్తున్నట్టు గుర్తించిన విషయం తెలిసిందే. ఈ యాప్‌లో యూజర్ ఐడీ, లాగిన్ పాస్‌వర్డ్‌లు తెలుసుకుని ఎంతమంది ఇందులో ఉన్నారన్న విషయాన్ని నిగ్గు తేల్చబోతున్నారు. నిందితుల బ్యాంక్ ఖాతాల వివరాలను తెలుసుకుని ఇప్పటి వరకు లావాదేవీలపై విచారణ చేస్తున్నారు. ఎప్పటి నుంచి ఈ ఖాతాల్లో లావాదేవీలు జరిగాయన్న దానిపై కూపీ లాగుతున్నారు. ఈ బెట్టింగ్ బాగోతంలో మరో పది మంది వరకు నిందితుల సంఖ్య తేలే అవకాశం ఉందని తెలుస్తోంది.



● జన'పంజా'

రంజాన్ పండుగను పురస్కరించుకుని పంజా సెంటర్‌కు ఆదివారం రాత్రి ముస్లింలు పోటెత్తారు. పండుగ సరుకులు కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో దుకాణాలు కిటకిటలాడాయి. బిర్యానీ హోటళ్లు, హలీం సెంటర్లు ఆహార ప్రియులతో సందడిగా కనిపించాయి.

నెరవేరిన సొంతింటి కల

1700 మందికి జీ+3 టిడ్కో ఇళ్లు పంపిణీ

ఇంటి తాళాలు, పట్టాలను అందజేసిన మంత్రి కొల్లు రవీంద్ర



లబ్ధిదారులకు ఇళ్ల పట్టా అందజేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ నారాయణరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ తదితరులు

మచిలీపట్నం టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను నెరవేర్చడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం గో సంఘంలో జి ప్లస్ త్రి టిడ్కో ఇళ్లను 1700 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇళ్ల తాళాలు, పట్టాలను మంత్రి రవీంద్ర మిగతా 6లో..

రహదారులకు మహర్దశ

జిల్లా రహదారుల అభివృద్ధికి రూ.15.35 కోట్లు

స్టేట్‌హైవేల అభివృద్ధికి మరో రూ.22.50కోట్లు

- శాసన సభ్యుల ద్వారా పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం
- త్వరలో టెండర్‌లు పిలిచి పనులు ప్రారంభించే అవకాశం

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం : జిల్లాలోని రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్లను పట్టించుకోకపోవడంతో జిల్లాలోని రోడ్లు అన్నీ గుంతలమయంగా మారాయి. ప్రయాణికులు అనేక అవస్థలు పడ్డారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జిల్లాకు చెందిన శాసన సభ్యులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు, అభివృద్ధి చేయాల్సిన రహదారుల జాబితాలతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపారు. రూ.37.85 కోట్ల అంచనాలతో ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. జిల్లాలోని రహదారుల అభివృద్ధి, వాటికి కేటాయించిన నిధుల వివరాలు ఇలా ఉన్నాయి.

● గన్నవరం నియోజకవర్గంలోని నున్న బైపాస్ రోడ్ 0 కిలోమీటరు నుంచి 5.660 కిలోమీటరు వరకు జాతీయ రహదారి లింక్ రోడ్డు కనెక్షన్‌తోపాటు రాయనపాడు, షైదూరుపాడు, కవులూరు, కట్టుబండిపాలెం వరకు ఉన్న రహదారిని 3.70కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసేందుకు రూ. 2.65 కోట్లతో అంచనాలు రూపొందించారు.

● పెడన నియోజకవర్గం కృత్తివెన్ను మండలంలోని పోడు గ్రామం నుంచి చినగొల్లపాలెం గ్రామం వరకు 14 కిలోమీటర్ల మేర ఉన్న రహదారిని పోడు గ్రామం నుంచి 6వ కిలోమీటరు వరకు, 8వ కిలోమీటరు నుంచి 14వ కిలోమీటరు వరకు మొత్తంగా 12కిలోమీటర్ల మేర అభివృద్ధి, మరమ్మతులు చేసేందుకు రూ. 4.2 కోట్లతో అంచనాలు రూపొందించారు.

● బంటుమిల్లి మండలం కొమాళ్లపూడి రహదారిని 0 కిలోమీటరు నుంచి 3వ కిలోమీటరు వరకు, 6వ కిలోమీటరు నుంచి 11వ కిలోమీటరు వరకు మొత్తంగా 8 కిలోమీటర్ల మేర అభివృద్ధి, మరమ్మతులు చేసేందుకు రూ.2.50కోట్లతో అంచనాలు రూపొందించారు.

● పెనమలూరు నియోజకవర్గంలోని ఉప్పులూరు-మద్దూరు రహదారిని 0 కిలోమీటరు నుంచి 4.200వ కిలోమీటరు వరకు, 4.650వ కిలో మీటరు నుంచి 10.825వ కిలోమీటరు వరకు 10.375 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసేందుకు రూ.3.50 కోట్లతో అంచనాలు రూపొందించారు.



మచిలీపట్నం-కమ్మవారి చెరువు రహదారి

స్టేట్ హైవేస్ విభాగంలో..

పామర్రు నియోజకవర్గంలోని గుడివాడ-చల్లపల్లి-కొత్తపాలెం రహదారి 20వ కిలోమీటరు నుంచి 21.500వ కిలోమీటరు వరకు, 22.600వ కిలోమీటరు నుంచి, 26వ కిలోమీటరు వరకు, 29వ కిలోమీటరు నుంచి 30వ కిలోమీటరు వరకు మొత్తంగా 5.90 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసేందుకు రూ.3.50 కోట్లతో అంచనాలు రూపొందించారు.

● గుడివాడ నియోజకవర్గంలోని ముదినేపల్లి-గుడ్లవల్లేరు మండలాలను కలిపే రహదారి 5వ కిలోమీటరు నుంచి 7వ కిలోమీటరు వరకు, 9.800వ కిలోమీటరు నుంచి 11.840వ కిలోమీటరు వరకు మొత్తంగా 3.64 కిలోమీటర్ల రహదారిని అభివృద్ధి చేసేందుకు రూ.2.50కోట్లతో మిగతా 6లో..

తిరువూరులో వేడెక్కిన రాజకీయం

మున్సిపాల్టీలో అధికార వైసీపీ కౌన్సిలర్ల మధ్య ఆధిపత్య పోరు

- మరో వైపు ఎమ్మెల్యే, ఏఎంసీ మాజీ చైర్మన్ మధ్య రగడ
- ఈ పరిణామాలు దేనికి దారితీస్తాయోనని సర్వత్రా ఉత్కంఠ

(తిరువూరు-ఆంధ్రజ్యోతి):తిరువూరు నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కింది. వైసీపీలో అధికార కౌన్సిలర్ల మధ్య ఆధిపత్య పోరు, టీడీపీలో ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఆలవాల నడుమ గొడవ పరిణామాలు ఉత్కంఠ రేపుతున్నాయి. ఇటీవల స్థానిక మున్సిపాల్టీలో అధికార వైసీపీ కౌన్సిలర్ల మధ్య ఆధిపత్య పోరు తాడేపల్లి ప్యాలెస్ వరకు వెళ్లి కొద్దిగా సద్దుమణిగినట్లు కనిపిస్తున్నా.. అంతర్గతంగా మాత్రం పోరు కొనసాగుతున్నట్లే వాతావరణం కనిపిస్తోంది. ప్రస్తుత చైర్‌పర్సన్ రాజీనామాకు సిద్ధమైనా పార్టీకి చెందిన మరొకరు చైర్‌పర్సన్‌గా ఎన్నిక కావడంపై పట్టణ ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పాలకవర్గానికి ఒక్క సంవత్సరం మాత్రమే పదవీకాలం ఉంది. ప్రస్తుత చైర్‌పర్సన్ రాజీనామా చేసినా మరొకర్ని ఎన్నుకునేందుకు నిబంధనల ప్రకారం సుమారు ఆరు నెలలు సమయం పడుతుందని, ఈలోగా ఎన్నికల కమిషన్ మున్సిపల్ ఎన్నికలు ప్రకటిస్తే ప్రస్తుత బోర్డు పదవీకాలం నాలుగు సంవత్సరాలకే పరిమితం అవుతుందని మరి కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మార్పు అంశం పట్టణ వైసీపీ అధ్యక్షుడు ఎంపికకు ముడిపడి ఉండటంతో ఆ పార్టీ నాయకులు ఎన్ని జాగ్రత్తలు మిగతా 6లో..



ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకుంటున్న భక్తులు



ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

దుర్గగుడిలో ఘనంగా ఉగాది ఉత్సవాలు

ఇంద్రకీలాద్రి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలకు అంకురార్పణ చేశారు. ఆదివారం వేకువ జామున మూడు గంటలకు సుప్రభాత సేవ అనంతరం అమ్మవారికి స్నపన కార్యక్రమాలు నిర్వహించారు. శరన్నవరాత్రులు, చైత్రమాస నవరాత్రులు, శాకంబరీ ఉత్సవాలు, పవిత్రోత్సవాలు తదితర ముఖ్యమైన సందర్భాలలో మాత్రమే అమ్మవారికి స్నపన చేయిస్తారు. ఈక్రమంలో ఆదివారం వేదమంత్రాల మధ్య అమ్మవారికి స్నపన కార్యక్రమం పూర్తిచేసి ప్రత్యేకమైన లేపనాల ద్వారా అమ్మవారిని అలంకరించారు. అర్చన, హారతులు ముగిసిన తరువాత భక్తులు అమ్మవారి దివ్యముఖారవిందాన్ని తిలకించి తన్మయులయ్యారు. తెలుగు సంవత్సరం తొలిరోజున అమ్మవారిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మిక.

ఉదయం 9 గంటలకు నటరాజస్వామి ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పూజా మందిరంలో చైత్రమాస పుష్పార్చనలు ప్రారంభమయ్యాయి. తొలిరోజున మల్లెలు, మరువంతో లలితా సహస్రనామాన్ని పారాయణ చేస్తూ అమ్మవారికి సమర్పించారు. భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. వేసవి సందర్భంగా భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.



రాజ్యపాలన బాగు బాగు..

- చల్లా శ్రీనివాసశర్మ

ఆలయంలో ఉగాది పంచాంగ పఠన కార్యక్రమాన్ని ఆస్థాన సిద్ధాంతి చల్లా శ్రీనివాస శర్మ పంచాంగ చేశారు. రాజు సూర్యుడు కావటంతో రాజ్యపాలన బాగుంటుందని తెలిపారు. దేవాలయాలు అభివృద్ధి చెందుతాయని, అన్నిరాశుల వారికి బాగుంటుందని, పరిపాలకులు ప్రజా సంక్షేమానికి పాటుపడతారని ఆయన పేర్కొన్నారు. పరిశ్రమలు, ఉద్యోగాలు వస్తాయన్నారు. ధనధాన్య సమృద్ధితో ప్రజలు ముందుకు వెళతారన్నారు. సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. గురుడు మూడు స్థానాల్లో ఉండటం వల్ల కొంత ఇబ్బందిగా ఉంటుందని, అయితే దుర్గమ్మ దర్శనం, చండీయాగం తదితరాలను చేయించటం ద్వారా పరిస్థితులు బాగుంటాయని చెప్పారు. ఈవో కె.రామచంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పుష్పార్చన కార్యక్రమాల్లో అమ్మవారికి హారతి సమర్పించి ప్రారంభించారు. ఉగాది సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని రంగు రంగుల పుష్పాలతో అలంకరించారు. ఉగాది సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు దుర్గామల్లేశ్వర దేవస్థానం తరఫున ఆశీస్సులు అందజేశారు. అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, పంచాంగాలను ఆయనకు అందజేశారు.

వెండిరథంపై ఊరేగిన గంగ, పార్వతీ మల్లేశ్వరులు

ఇంద్రకీలాద్రిపై చైత్రమాస వసంత నవరాత్రులను పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం వెండి రథంపై గంగ, పార్వతీ మల్లేశ్వరుల ఉత్సవమూర్తుల ఊరేగింపు భక్తిపారవశ్యంతో సాగింది. ఈవో, దేవదాయ కమిషనర్ కె.రామచంద్రమోహన్ సతీ సమేతంగా కొబ్బరికాయ కొట్టి ఊరేగింపును ప్రారంభించారు. బ్రాహ్మణవీధి మీదుగా వన్‌టౌన్ పురవీధుల్లో రథోత్సవం సాగింది.



భక్తులు దేవేరుల రథానికి స్వాగతం పలుకుతూ కొబ్బరికాయలు, పండ్లు సమర్పించారు.

ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉగాది వేడుకలు

» ముఖ్య అతిథులుగా హాజరైన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య, ముఖ్యమంత్రి చంద్రబాబు


» ఫార్మా మాన్యుఫ్యాక్చరింగ్ స్కిల్ సెంటర్, ఫార్మా తయారీ ల్యాబ్‌లను ప్రారంభించిన సీఎం

గన్నవరం/ఉంగుటూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా, ఉంగుటూరు మండలం, ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ (విజయవాడ చాప్టర్)లో ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, స్వర్ణభారత్‌ట్రస్ట్ స్ఫూర్తి ప్రదాత, మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. తొలుత ట్రస్ట్ ఆవరణలోని స్వామి వివేకానంద విగ్రహానికి పుష్పాంజలులు ఘటించారు. అనంతరం ముప్పవరపు ఫౌండేషన్ సందర్శించిన సీఎం అక్కడ అందిస్తున్న కోర్సుల గురించి ట్రస్ట్ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ అబ్దుల్‌కలాం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రాంగణంలోని మాజీ రాష్ట్రపతి స్వర్గీయ డాక్టర్ అబ్దుల్ కలాం విగ్రహానికి పూల మాలవేసి నివాళులర్పించారు. వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. సువెన్ ఫార్మా, ఎల్ఎస్ఎస్ఎస్‌డీసీ సహకారంతో ఇటీవల ట్రస్ట్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటుచేసిన డాక్టర్ యల్లాప్రగడ సుబ్బారావు సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఇన్ ఫార్మా మాన్యుఫ్యాక్చరింగ్ స్కిల్ సెంటర్, ఫార్మా తయారీ ల్యాబ్‌లను సీఎం ప్రారంభించారు. శిక్షణ పొందుతున్న విద్యార్థినులతో ముచ్చటించారు.



జ్యోతి వెలిగిస్తున్న సీఎం చంద్రబాబు

ముందుగా ట్రస్టు కార్యాకలాపాలను మేనేజింగ్ ట్రస్టీ దీపా వెంకట్ వివరించారు. 1.75లక్షల మంది యువతీయువకులకు శిక్షణ ఇచ్చామని, 50శాతం మంది స్వయం ఉపాధి సాధించారన్నారు. 5.50 లక్షల మందికి ఉచిత వైద్య సేవలు అందించామన్నారు. ఫౌండేషన్ ద్వారా గ్రామీణ విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీ వి.బాలశౌరి, మంత్రి రవీంద్ర, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, సుజనాచౌదరి, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఇమ్మణ్ణి దీపావెంకట్, ట్రస్ట్ ప్రతినిధులు చుక్కపల్లి ప్రసాద్, మండవ ప్రభాకర్, రాజయ్య, గ్రంధి శ్రీనివాస్, పి.పరదేశి, సువెన్ ఫార్మా ప్రతినిధి పీఎస్ఎన్.మూర్తి, ఎల్ఎస్ఎస్ఎస్‌డీసీ వైస్ ప్రెసిడెంట్ అన్షుల్ సక్సేనా, సౌత్‌హెడ్ అమరేంద్రబాబు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ట్రస్ట్ ప్రతినిధుల సమన్వయంతో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎస్పీ ఆర్.గంగాధరరావు నేతృత్వంలో తదితర ఉన్నతాధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.



పచ్చడి, పంచాంగం పద్యం కలిపితేనే ఉగాది

- గరికపాటి నరసింహారావు

గన్నవరం : ఆశావాదమే ఉగాది అని ఉపన్యాసకులు గరికపాటి నరసింహారావు ఉద్ఘాటించారు. పచ్చడి, పంచాంగం, పద్యం కలిపితేనే ఉగాది, అవుతుందన్నారు. దేవుడు లేని పండుగా ఏదైనా ఉందంటే అది ఉగాది. ఉగాది నాడు ఏ దేవుడినైన పూజించవచ్చు. ఆరు రుచులను తీసుకుంటేనే జీవితం సాఫీగా సాగుతుందని గరికపాటి పేర్కొన్నారు. ఉగాది ప్రశస్తి ప్రసంగంలో గరికపాటి మాట్లాడుతూ మనస్థితి, పరిస్థితి, గ్రహస్థితిపై జీవితాలు ఆధారపడి ఉన్నాయని చెప్పారు. కాలం చక్రం లాంటిదని తిరిగి మళ్లీ అదే స్థితికి వస్తుందన్నారు. భారతీయ వైభవం నిచ్చెనలాంటిది కాదని, చక్రం వంటిదన్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చిన పేర్లు వారసులకు పెడుతున్నారని, గతంలో పూర్వీకుల పేర్లు పెట్టి వారిలో పెద్దలను చూసుకునే వారని చెప్పారు. వారి ఆదర్శాలు, సాంప్రదాయాలు పిల్లలకు అలవాటు చేసేవారని నేటి పరిస్థితి అలా లేదని చెప్పారు. తెలుగు ఎంతో గొప్పదని చెప్పారు. అమ్మ, ఆవు, ఇల్లు, ఈశ్వరుడు మంచి అర్థాలను ఇస్తాయన్నారు. హిందూ జీవన విధానంలో ఈ నాలుగింటికి సమాధానం చెప్పకపోతే ఆ పురుషుడు భారతీయుడు కాదని చెప్పారు. ఎప్పుడు నవ్వుతూ ఉండటమే మనిషికి నిజమైన గోల్ అని చెప్పారు. పరమమైన అర్థం తెలుసుకుంటే గాని జీవితం అర్థం కాదన్నారు. విద్యార్థికి, ఉపాధ్యాయుడికి ఒక ధర్మం ఉందని దానిని ఇద్దరు పాటించటం లేదన్నారు. ప్రతి రూపాయి పాపాల పుట్టలో నుంచి కాకుండా, పాల సముద్రంలో నుంచి రావాలన్నారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం అంటే అందరి ఇళ్లల్లో బంగారం నిండి ఉంటుందన్నారు. ఆత్మ విశ్వాసం ముఖ్యమని దానితో ముందుకు వెలితే విజయం తథ్యమన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా దక్షిణోత్తర నృత్య ప్రదర్శన





ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రిపై వసంత నవరాత్రులను పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం హైదరాబాద్ పరంపర ఫౌండేషన్ ఆధ్వర్యంలో దక్షిణోత్తరం (దక్షిణ భారత), ఉత్తర (ఉత్తర భారత) సంప్రదాయాల సామరస్యపూర్వకమైన కలయికతో ప్రదర్శనను ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీతలు నిరుపమ, రాజేంద్ర శిష్య బృందం భరతనాట్యం, కథక్ నృత్య ప్రదర్శన చేశారు. రాజగోపురం ప్రాంగణంలో ఈవో కె.రామచంద్రమోహన్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రాచీన హిందూ సంస్కృతిని, సనాతన ధర్మాన్ని భవిష్యత్ తరాలకు తెలియజెప్పే బాధ్యత అందరిది అని ప్రకటించిన సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా గుడి సంబరాలు పేరిట ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు పరంపర ఫౌండేషన్ బాధ్యులు శ్రీనగి, శశిరెడ్డి, ప్రమోద్‌లు తెలిపారు. పరంపర ఫౌండేషన్ రూపొందించిన కళావేదిక పై ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉగాది సందర్భంగా పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు కళా ప్రదర్శనను తిలకించారు.

మంచి కార్యక్రమాలకు తొలి అడుగు

» ఉగాది వేడుకలో కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరంలో మంచి ఆలోచనలు, కార్యాలతో జీవితాన్ని ప్రారంభించేందుకు మొదటి అడుగు వేయాలని కృష్ణా జిల్లా కలెకర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. ఆదివారం బచ్చుపేట వెంకటేశ్వరస్వామి కళ్యాణ మండపంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకలను బాలాజీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, జేసీ గీతాంజలి శర్మ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, కొత్త సంవత్సరంలో మంచి ఆలోచనలు, కార్యాలతో జీవితాన్ని ప్రారంభించేందుకు మొదటి అడుగు వేయాలన్నారు. జీవితాన్ని మంచి ఉద్దేశంతో మొదలు పెట్టడానికి ఇదొక సువర్ణ అవకాశమన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ, పక్కన జేసీ గీతాంజలి శర్మ తదితరులు

కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. విష్ణుభొట్ల సూర్యనారాయణ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఈ సంవత్సరం రైతులు, కార్మికులు, పాలకులు, అధికారులకు అందరికీ యోగదాయకమైన, అనుకూలమైన సంవత్సరం అన్నారు. అనంతరం పంచాంగకర్తలను, కవులను ఘనంగా సన్మానించారు.



సీఎం చంద్రబాబు నుంచి కళారత్న, ఉగాది పురస్కారాలు అందుకుంటున్న (ఎడమ నుంచి వరుసగా) గుత్తికొండ సుబ్బారావు, కార్టూనిస్టు టీవీ, అంకబాబు, కుమార సూర్యనారాయణ, ఓలేటి పార్వతీశం, వేమూరి బలరాం, చింతా రవిబాలకృష్ణ, భాగవతుల సౌమ్య, మల్లాది బ్రదర్స్, కోమటి జయరాం, చలపాక ప్రకాష్, బండ్ల మాధవరావు, కొల్లూరి, కలిమిశ్రీ, వేంపల్లి షరీఫ్, గోళ్ల వాణి, ప్రసాద్, దూపాటి శ్రీదేవి, కృత్తివెన్ను శ్రీనివాసరావు, మొండెపు ప్రసాద్, ఉమామహేశ్వరపాత్రుడు, పోపూరి గౌరీనాథ్, రాజేష్



సంస్థ ఉద్యోగులకు దుస్తులు అందజేస్తున్న ఉప్పలపాటి ఉదయభాస్కరరాజు

'రైజ్ ఎన్ రైజ్'లో ఉత్సాహంగా..

పాయకాపురం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థ రైజ్ ఎన్ రైజ్ ఆధ్వర్యంలో ఉగాది సంబరాలు ఆదివారం ఘనంగా జరిగాయి. సంస్థ చైర్మన్ ఉప్పలపాటి ఉదయభాస్కరరాజు ఆంధ్రప్రభ కాలనీలోని కార్యాలయంలో ఉదయం పూజలు నిర్వహించారు. అనంతరం సంస్థ ఉద్యోగులు 150 మందికి దుస్తులు, చీరలు అందజేశారు. కార్యాలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేసి అజిత్‌సింగ్‌నగర్ సీఐ వెంకటేశ్వర్లుతో కలిసి ప్రయాణికులు, పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే ఉగాదిని పురస్కరించుకని సుందరయ్యనగర్ ప్రాంతంలో ముగ్గుల పోటీలు, లెమన్ స్పూన్, పరుగుపందెం నిర్వహించారు. విజేతలకు వెండి పట్టీలు, డ్రస్సింగ్ టేబుల్, ప్రెషర్ కుక్కర్ అందజేశారు. సంస్థ డైరక్టర్లు ఎస్.సన్యాసిరావు, ఎ.పెద్దిరాజు, వీసీ కుమార్, ఎంవీవీ. కృష్ణారావు, టి.రాజు పాల్గొన్నారు.

తెలంగాణ గవర్నర్ చేతులమీదుగా..

కూచిపూడి: కూచిపూడి గ్రామానికి చెందిన తాడేపల్లి సాయికృష్ణ ఉత్తమ నాట్యాచార్యులుగా ఉగాది పురస్కారాన్ని తెలంగాణ రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆ రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ అందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ చీఫ్ సెక్రటరీ శాంతకుమారి, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న సాయికృష్ణ

ఖుర్దా రోడ్డు డివిజన్‌లో పట్టాలు తప్పిన రైలు

» విజయవాడలో హెల్ప్ డెస్క్

రైల్వేస్టేషన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఒడిసాలోని ఖుర్దా రోడ్డు డివిజన్‌లో నెర్గుండి స్టేషన్ వద్ద ఆదివారం మధ్యాహ్నం కామాఖ్య ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. మొత్తం 11 స్లీపర్ బోగీలు పట్టాలు తప్పాయి. ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదని చెబుతున్నారు. రైల్వే అధికారులు, ఎన్డీఆర్ సిబ్బంది, ఫైర్ సిబ్బంది హుటాహుటిన సహాయ కార్యక్రమాలకు చేపట్టారు. ఈ క్రమంలో విజయవాడ డివిజన్ పరిధిలోని విజయవాడ స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశారు. 0866-2575167 నెంబరుకు ఫోన్‌చేసి సంబంధిత ప్రయాణికుల బంధువులు సమాచారం తెలుసుకోవచ్చు.

వేడుకగా ఉగాది పురస్కారాల ప్రదానం

విజయవాడ కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది మహోత్సవం విజయవాడ తుమ్మపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆదివారం ఘనంగా జరిగాయి. పల్లె సంప్రదాయాన్ని ప్రతిబింబించే తెలుగు లోగిలి, ఉగాది పచ్చడి విందు, పంచాంగ శ్రవణం, కూచిపూడి జానపద నృత్య ప్రదర్శన, సంప్రదాయ వస్త్రధారణలో ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల కోలాహలం, ప్రభుత్వ అధినేత ప్రసంగం, ప్రముఖులకు పురస్కారాల ప్రదానం మేళవించి ఉగాది మహోత్సవం ఘనంగా జరిగింది. వేదికపై నాట్యాచార్య నప్పా శివకుమార్ బృందం ప్రదర్శించిన స్వాగతం సుస్వాగతం, ఉగాది పండుగ విశిష్టత, అమరావతి వైభవం నాట్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నాట్యాచారిని పద్మశ్రీ హేమంత్ బృందం, యువ నర్తకి లేఖ్యా భరణి ప్రదర్శించిన కాలభైరవాష్టకం, యల్లాజోస్యుల అనురాధ బృందం ప్రదర్శించిన చందన చర్చిత, శైలజ శ్రీ బృందం జతి స్వర నాట్యాలు, స్వర్ణలత ప్రదర్శించిన జయము జయము అంశాలు కనువిందు చేశాయి.

ఆకట్టుకున్న వేదిక

ఉగాది మహోత్సవాల వేదికను తెలుగు లోగిలిగా, పల్లె వాతావరణాన్ని ప్రతిబింబించే విధంగా తీర్చిదిద్దారు. అలనాటి పెంకుటిల్లు, దాని పక్కనే బావి, ఇంటికి ఇరువైపులా రెండు మామిడి చెట్లు, రచ్చబండ, దానిపై పంచాంగ శ్రవణం చేసే పండితుడు ఇలా ఉగాది వేదిక ఆకట్టుకుంది.

సమన్వయలోపం

దేవదాయ, సాంస్కృతిక శాఖల సంయుక్తంగా నిర్వహించిన ఉత్సవంలో సమన్వయలోపం కనిపించింది. అతిథులను, పురస్కార గ్రహీతలను ఆహ్వానిస్తూ, వారికి కేటాయించిన సీట్ల బాధ్యతను సాంస్కృతిక శాఖ స్వీకరించింది. పురస్కార గ్రహీతలను సరిగా రిసీవ్ చేయలేకపోవడంతో పలువురు ప్రముఖులు అసహనం వ్యక్తం చేశారు. వేదికపై ధర్మకోల్ షీటుతో ఉగాది సంబరాలు 2025 పేరిట అతికించిన పేరులో 2 అంకె ఊడి నృత్య ప్రదర్శన సమయంలో కింద పడిపోయింది. సభ ఆటంకం కలుగుతుందని మిగిలిన అంకెలను తొలగించారు.

హాజరైన ప్రముఖులు

ఉగాది సంబరాల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.వి జయానంద్, దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్, పౌర సంబంధాల శాఖ మంత్రి పార్థసారథి, పర్యాటక సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అజయ్ జైన్, దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, రాజ్యసభ మాజీ సభ్యుడు కంభంపాటి రామ్మోహన్, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, మండలి బుద్ధప్రసాద్, గద్దె రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, సృజనాత్మక-సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ పి.తేజస్విని, నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు.

● సీఎం చంద్రబాబు కళారత్న 83 మందికి, ఉగాది పురస్కారాలు 121 మందికి అందించి చివరివరకు ఓపికగా ఉండటం, అందరితో ఫోటోలు దిగడం పట్ల సభికులు, పురస్కార గ్రహీతలు చంద్రబాబుపై ప్రశంసల వర్షం కురిపించారు. మరోవైపు, అవార్డులు అందుకున్న వృద్ధ కళాకారులు కళారత్న(హంస) అవార్డు బరువుగా ఉండటంతో కలెక్టర్ స్వయంగా పురస్కార గ్రహీతల వెంట వాటిని మోస్తూ మెట్లు దిగేంత వరకు సాగనంపారు. పురస్కార గ్రహీతలు ప్రశంసలు కురిపించారు.

పంచాంగాల ఆవిష్కరణ

టీటీడీ, వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ పంచాంగాలతోపాటు సాంస్కృతిక శాఖ రూపొందించిన క్యాలెండర్లను సీఎం చంద్రబాబు ఆవిష్కరించారు. దుర్గామల్లేశ్వర దేవస్థాన ఆస్థాన పండితులు వేద గోష్ఠి నిర్వహించారు. వేద పఠనం అనంతరం పండితులను సీఎం ఘనంగా సత్కరించారు. పంచాంగ శ్రవణం అనంతరం మాడుగుల నాగఫణి శర్మను చంద్రబాబు సత్కరించగా, సరస్వతి అవధాన పీఠం నుంచి మాడుగుల నాగఫణి శర్మ ప్రత్యేక కానుక అందించి చంద్రబాబును సత్కరించారు. ప్రారంభంలో సీఎం చంద్రబాబు నాయుడును వేద పండితులు మంగళవాయిద్యాలతో వేదికపైకి ఆహ్వానించగా, రాజమండ్రి కమాండెంట్ కొండా నరసింహారావు దంపతులు శంఖనాదం చేశారు.

హంస అవార్డు గ్రహీతలు

డాక్టర్ కృతివెంటి శ్రీనివాసరావు, మొండెపు ప్రసాద్, పోపూరి గౌరీనాథ్, పారుపల్లి శ్రీ, మల్లాది బ్రదర్స్, కుమార సూర్యనారాయణ, పసుమర్తి వెంకటేశ్వరశర్మ, పిల్లా ఉమామహేశ్వరపాత్రుడు, టీవీ రావు, దామోదర గణపతిరావు, రామకుమారి రాజేష్(రంగం రాజేష్), బవిర రవి, ఎం.నాగేశ్వరరావు, వేమూరి బలరాం, కె.నాగసుధాకర్, కొల్లు అంకబాబు, వి.శ్రీరాములు, ఆకురాతి కోదండరామయ్య, లంకా అన్నపూర్ణ, బీవీఎస్ సౌమ్య, చింతా రవిబాలకృష్ణ, కోమటి జయరాం

ఉగాది పురస్కార గ్రహీతలు

చలపాక ప్రకాష్, బండ్ల మాధవరావు, డాక్టర్ ఎం.హరికిషన్, వల్లభనేని అశ్వనీకుమార్, కలిమికొండ సాంబశివరావు, అవనిగడ్డ సూర్యప్రకాష్, యలమర్తి అనురాధ, లగపాటి సంగయ్య, డాక్టర్ చింతలపాటి మోహన మురళీకృష్ణ, ఎ.వరప్రసాదరావు, అన్నవరపు బ్రహ్మయ్య, దాసరి ఆళ్వారుస్వామి, యనమదల మంజు, కప్పగంతు రామకృష్ణ, కొల్లూరి, స్ఫూర్తి గురురాజు, సింహాద్రి వాణి, మీరాబాయి, అరసవల్లి గిరిధర్, ఇంజారపు రమణమ్మ, గోళ్ల వాణి, దేవినేని మధుసూదనరావు, అక్కినేని భవానీప్రసాద్, దూపాటి శ్రీదేవి, తుమ్మల విల్సన్ సుధాకర్, ఎస్.కల్యాణరామన్, రెంటాల జయదేవ.

కరకష్టం

(5వ పేజీ తరువాయి)

రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులకు మాత్రమే అనుమతి ఉంది. బస్సులతోపాటు అధిక లోడుతో లారీలు, టిప్పర్లు, ట్రాక్టర్లు తిరుగుతున్నాయి. జాతీయ రహదారిపై నడిపినట్టుగా డ్రైవర్లు కరకట్టపై టిప్పర్లు, ట్రాక్టర్లు నడుపుతున్నారు. దీనితో కరకట్ట వాసులు భయాందోళన చెందుతున్నారు.

బెంబేలెత్తిపోతున్న వాకర్లు

యనమలకుదురు శివాలయం నుంచి రామలింగేశ్వరనగర్, బాలాజీనగర్ సర్వీసు రోడ్డులో తెల్లవారుజామున మహిళలు, పురుషులు వాకింగ్ చేస్తుంటారు. ఈ టిప్పర్ల దెబ్బకు వారు వాకింగ్ కోసం రోడ్డెక్కడానికి భయపడుతున్నారు. వ్యాయామం కోసం కొంతమంది నడుస్తున్నా గుండెలు గుప్పెట్లో పెట్టుకుంటున్నారు. ఒక టిప్పర్ సామర్థ్యం 18 టన్నులు ఉంటుంది. దీనిలో 20 టన్నుల వరకు ఇసుకను లోడు చేయవచ్చు. ఇసుకాసరులు ధనార్జన కోసం ఒక్కో టిప్పర్‌లో 40 టన్నుల ఇసుకను లోడ్ చేస్తున్నారు. డ్రైవర్ క్యాబిన్ ఎత్తు దాటి ఇసుకను నింపుతున్నారు. ఇసుక పైకి ఎగురకుండా దానిపై పలచటి చాపను వేస్తున్నారు. దీన్ని పటిష్ఠంగా వేయక పోవడం, టిప్పర్ సామర్థ్యం దాటి లోడ్ చేయడంతో ఇసుక ఒక సన్నిటి ధారలా కారిపోతోంది. ఈ ఇసుకంతా కరకట్టపై పడి ఉంటుంది. దీనితో ద్విచక్రవాహన దారులు బ్రేకులు వేసినప్పుడు అదుపు తప్పి పడిపోతున్నారు. కొద్దినెలలుగా రామలింగేశ్వరనగర్ కరకట్టపై ఈ తరహా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ టిప్పర్ల అధిక బరువుకు శ్మశానం కూడలి నుంచి ఇస్కాన్ ఆలయం వరకు ఉన్న రహదారి కుంగిపోయింది. ఈ రహదారికి దిగువున తాగునీటి పైపులైన్ ఉంది. ఈ టిప్పర్ల కారణంగా పైపులైన్ పగిలిపోయే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చేస్తున్నారు.

అనుమతించవద్దని ఆదేశాలు ఇచ్చాం

కరకట్ట మీదుగా టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్లకు అనుమతి లేదు. వాటి రాకపోకలు అవనిగడ్డ కరకట్టపై నిషేధం. బందరు రోడ్డు, జాతీయ రహదారి మీదుగా రాకపోకలు సాగాలి. రామలింగేశ్వరనగర్ కరకట్ట మీద నుంచి ఇసుక లారీలు, టిప్పర్లను అనుమతించవద్దని ట్రాఫిక్ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం.

-ప్రసన్నకుమార్, ట్రాఫిక్ ఏడీసీపీ

తిరువూరులో వేడెక్కిన రాజకీయం

(5వ పేజీ తరువాయి)

తీసుకుంటున్నా మున్సిపల్ వివాదం రోజురోజుకు ముదురుతూనే ఉంది. ఏప్రిల్‌లో జరిగే కౌన్సిల్ సమావేశంలో మున్సిపాల్టీలో ఆధిపత్య పోరుకు తెరపడుతుందా లేకా మరో వివాదం నెలకొంటుందా అనే అనుమానం పట్టణ ప్రజల్లోనూ, కొందరు కౌన్సిలర్లలోనూ నెలకొంది. ఇప్పటికే మున్సిపాల్టీలో వైసీపీలో నెలకొన్న ఆధిపత్య పోరుకు తోడు, స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఏఎంసీ మాజీ చైర్మన్ ఆలవాలపై పార్టీ చర్యలు తీసుకోకపోతే ఎమ్మెల్యేగా రాజీనామా చేస్తానని ప్రకటించడం పట్టణంలో తీవ్ర దుమారం లేపింది. కొందరు నాయకులు నియోజకవర్గం నుంచి రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వెళ్లి నియోజకర్గంలో నెలకొన్న పరిస్థితులు వివరించడం, జిల్లా స్థాయి నాయకులు తిరువూరు నియోజకవర్గంపై అధిష్టానానికి నివేదిక ఇవ్వడం వంటి చర్యలతో పట్టణంలో పలు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. రెండు పార్టీల్లో భవిష్యత్ పరిణామాలు ఏం జరుగుతాయనే ఉత్కంట పట్టణ ప్రజల్లో నెలకొంది.

రహదారులకు మహర్దశ

(5వ పేజీ తరువాయి)

అంచనాలు రూపొందించారు.

● గుడివాడ పట్టణంలోని బైపాస్ రహదారిని 3.66 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసేందుకు రూ.2.50కోట్లతో అంచనాలు రూపొందించారు.

● మచిలీపట్నం నియోజకవర్గంలోని కమ్మవారిచెరువు రహదారిని 12వ కిలోమీటరు నుంచి 15.700 కిలోమీటరు వరకు 3.70 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసేందుకు రూ.1.50కోట్లతో అంచనాలు రూపొందించారు.

● అవనిగడ్డ నియోజకవర్గం చల్లపల్లి మండలంలోని రామానగరం నుంచి నడకుదురు వరకు 10.80 కిలోమీటర్ల మేర రహదారిని అభివృద్ధి చేసేందుకు రూ.5కోట్ల అంచనాలు రూపొందించారు.

● పెడన సింగరాయపాలెం-బంటుమిల్లి రహదారి 7వ కిలోమీటరు నుంచి 15.800వ కిలోమీటరు వరకు మొత్తంగా 8.80 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేసేందుకు రూ.4కోట్లతో అంచనాలు రూపొందించారు.

నెరవేరిన సొంతింటి కల

(5వ పేజీ తరువాయి)

అందజేశారు. 2014-19లో టీడీపీ ప్రభుత్వం మునిసిపల్ ప్రాంతాల్లో జి+త్రి ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందన్నారు. మునిసిపాలిటీలో 6,400 ఇళ్లు మంజూరైతే అందులో 4 వేల ఇళ్ల నిర్మాణం చేపట్టగా 2,300 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. వీటిలో 1,700 ఇళ్లను ఇచ్చామని, మిగిలిన ఇళ్లు కూడా త్వరలో పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, మోటమర్రి బాబాప్రసాద్, బండి రామకృష్ణ, గొర్రెపాటి గోపీచంద్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	162, 171, 182
చికెన్ విత్ స్కిన్	310
చికెన్ స్కిన్‌లెస్	320

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 460

యనమలకుదురులో బస్టాప్ నిర్మాణానికి శంకుస్థాపన

పెనమలూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురులోని శివపార్వతినగర్ ప్రధాన రోడ్డులో సిటీ బస్టాప్ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన నిర్వహించారు. బస్టాప్ నిర్మాణానికి టీడీపీ నాయకులు సుంకర చినబాబు ఆర్థికసాయం అందించడానికి హామీ ఇచ్చారు. శివపార్వతి నగర్, సాయినగర్ వాసులకు బస్‌స్టాప్‌లో ఉండేట్లు నిర్మిస్తామని స్థానిక టీడీపీ నాయకులు అనంతనేని ఆజాద్ తెలిపారు. శంకుస్థాపన కార్యక్రమంలో టీడీపీ నేతలు ప్రకాష్, రమేష్, శ్రీనివాస్, నారాయణ, వెంకన్న, జనసేన పార్టీ నాయకులు బాబు, బాలాజీ, తమ్ము అశోక్, నాగరాజు, శేఖర్, వెంకట్రావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.





రాణమ్మతల్లి ఆలయంలో నిర్వహిస్తున్న కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా శాంతి కల్యాణోత్సవం

హనుమాన్‌జంక్షన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నూజివీడు రోడ్డులోని ప్రమీలా రాణమ్మ తల్లి ఆలయంలో నిర్వాహకులు ఆదివారం శ్రీగోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామి వార్ల శాంతి కల్యాణోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు అన్నే రాంబాబు, పోలగాని నరసింహరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవంలో పలువురు పుణ్య దంపతులు పాల్గొని పూజా కార్యక్రమాలను ఆచరించారు. ఆలయ అర్చకులు మురళీశర్మ కల్యాణోత్సవాన్ని జరిపించారు. అనంతరం గోవిందమాంబ, వీరబ్రహ్మేంద్రస్వామి, రాణమ్మతల్లి ఉత్సవ మూర్తులకు మేళతాళాలు, కోలాటం బృందాలు, విచిత్ర వేషాలు, కళారూపాల నడుమ గ్రామంలో గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

వసంత నవరాత్రులు ప్రారంభం

గన్నవరం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : పాత గన్నవరంలోని లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో వసంత నవరాత్రులు ఆదివారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. లక్ష్మీతిరుపతమ్మకు ఉదయం ప్రత్యేక పూజలు జరిపారు. మొదటి రోజు వస్త్రలంకరణ అమ్మవారికి వీరమాచినేని జానకిబాయి సమర్పించారు. గులాబి పూలతో అర్చన చేశారు. భక్తులు లలిత సహస్రనామ, హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. జాస్తి విజయభాస్కర్, శివ నాగేంద్రం దంపతులు ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కళా సంపదను కాపాడుకోవాలి

ఉయ్యూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : అద్భుత కళా సంపదను కాపాడుకోవాలిసిన ఆవశ్యకత అందరిపైనా ఉందని ఏజీ అండ్ ఎస్ జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, గౌరవ అధ్యక్షులు సత్తార్, నూకల సాంబశివరావు అన్నారు. యాకమూరుకు చెందిన శ్రీబృందావన మాలి కోలాట భజన మండలికి ప్రోత్సాహకంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ. 10వేల ఆర్థికసాయం శనివారం అందజేశారు. కోలాట భజన నేర్చుకుని బృందానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని అసోసియేషన్ సెక్రటరీ పూర్ణచంద్రరావు ఆకాంక్షించారు. వినయ్‌కుమార్, వెంకటేశ్వరరావు, బ్రహ్మేశ్వరరావు, ప్రసాద్, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి మృతి

గన్నవరం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బూతిమిల్లిపాడులో అనారోగ్య సమస్యల నేపథ్యంలో ఒక వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఎస్ మణిబాబు (34) వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన అతనికి ఇటీవల కామెర్లు అయ్యాయి. పత్యం సరిగా చేయకపోవటం వల్ల అనారోగ్యం బారిన పడ్డాడు. అనారోగ్య సమస్యలను తాళలేక ఇంటిలో ఫ్యాన్‌కు బెల్టుతో ఉరివేసు కుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొద్దిసేపటికి కుటుంబ సభ్యులు గమనించి అవుటపల్లిలోని పిన్నమనేని ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వాస్పత్రికి మృతదేహాన్ని తరలించారు.

శివాలయానికి మైక్‌సెట్ బహూకరణ

కంకిపాడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : శివాలయంలో నిత్యం నిర్వహిస్తున్న నిత్య పూజలు ప్రజలకు చేరువయ్యేందుకు అవసరమైన మైక్‌సెట్‌ను బహూకరించారు. స్థానిక శివాలయంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని మైక్‌సెట్‌ను ఆదివారం పులి శ్రీనివాసరావు, ఆయన సతీమణి సత్యవతితో కలిసి అందజేశారు. ఈ కార్య క్రమంలో టీడీపీ నాయకులు కొండా నాగేశ్వరరావు, గోగినేని వెంకటరమణ, దివి రోహిణి, జనసేన పార్టీ నాయకులు సుంకర సురేష్, పిచుక రవి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ

కంకిపాడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో దళితులకు సమాన హక్కు అందించిన ఘనత రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్‌కే దక్కుతుందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పంతగాని రమేష్, ప్రజా పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మొవ్వల అన్వేష్‌లు అన్నారు. కంకిపాడు మండలంలోని నెప్పల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షులు పెగ్గం ప్రసాద్, వివిధ ప్రజాసంఘాల నాయకులు వడ్డాది ప్రసాద్, రామనాథ్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కంకిపాడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కంకిపాడు ఎలక్ట్రికల్ వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తానని అసోసియేషన్ నూతన కార్యవర్గం అధ్యక్షులు ప్రొద్దుటూరి ఆంజనేయులు అన్నారు. కంకిపాడు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం కంకిపాడులో ఎన్నిక జరిగింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా గుబ్బల నరసింహరావు, కార్యవర్గ సభ్యులుగా మేరుగ రాజా రమేష్, వక్కలగడ్డ శంకరరావు, దేవాది వెంకట విఠల్, ఘంటా ప్రవీణ్ కుమార్, పుట్టా రామకృష్ణ, బొబ్బిలి రమేష్, శ్రీకాంత్, వేణు గోపాలరావు, నాగరాజులను ఎన్నుకొన్నారు.

అలరించిన చిన్నారి వీణానాదం

ఉయ్యూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ఉగాది పర్వదినం పురస్కరించుకుని స్థానిక శివాలయం ఆవరణలో ఆదివారం చిన్నారి నిమ్మరాజు నిఖిల ప్రియ వీణానాదం అందరిని అలరించింది. ఆల్ ఇండియా రేడియో కళాకారిణి సుసర్ల నందిని శ్రీనివాస్ శిష్యురాలైన నిఖిల ప్రియ చేసిన వీణానాదం వీనుల విందుచేసి అందరిని ఆశ్చర్య చకితులను చేసింది. చిన్నారి వీణానాదంతో పరవశులైన వారు ఆమెను అభినందనలతో ముంచెత్తారు. కళలు అంతరించిపోతున్న తరుణంలో నేటితరానికి వాటి విశిష్టత తెలియచేయడం సంతోషకరమని పలువురు ప్రశంసించారు. విజయవాడలో 7వ తరగతి చదువుతున్న నిఖిలకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు.

నూతన ఆవిష్కరణలు రూపొందించాలి

అగ్రిక్లినిక్స్-అగ్రి బిజినెస్‌లో శిక్షణ పొందిన విద్యార్థులతో కలెక్టర్ డీకే బాలాజీ



అగ్రిక్లినిక్స్-అగ్రిబిజినెస్‌లో శిక్షణ పొందిన విద్యార్థులతో సీఎం చంద్రబాబు, పక్కన ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్

ఉంగుటూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అధిక ఆదాయం చేకూర్చే విధంగా నూతన ఆవిష్కరణలు రూపొందించాలని కలెక్టర్ డీకే బాలాజీ యువ వ్యవసాయ పారిశ్రామిక వేత్తలను కోరారు. మండలంలోని ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్‌లోని ముప్పవరపు ఫౌండేషన్ -విజ్ఞానవికాస కేంద్రంలో ఎలీప్ ఇండియా, సెంటర్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ (సీఈడీ), నోడల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ సంయుక్తంగా 45రోజులపాటు అగ్రి క్లినిక్స్, అగ్రి బిజినెస్‌లో నిర్వహించిన శిక్షణను విజయవంతంగా పూర్తిచేసుకున్న విద్యార్థులు ఆదివారం ఉగాది సంబరాల్లో పాల్గొనేందుకు ట్రస్ట్‌కు విచ్చేసిన సీఎం చంద్రబాబునాయుడిని కలిసి ఫోటో దిగేందుకు ముచ్చటపడ్డారు. వారి కోర్కెను తీర్చిన సీఎం అక్కడనుంచి ప్రాంగణంలోని వివిధ శిక్షణా కేంద్రాల సందర్శనకు వెళ్లారు. ఈక్రమంలో సీఎం వెంట వచ్చిన కలెక్టర్ బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మలతో కూడా విద్యార్థులు ఫోటోలు దిగారు. ఈ సందర్భంగా కలెక్టర్ వ్యవసాయ అనుబంధరంగాల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు గ్రామాలకు వెళ్లి క్షేత్రస్థాయిలో వ్యవసాయ సాగు విధానాలను పరిశీలించాలన్నారు. రైతులు పంటలు ఎలా పండిస్తున్నారు. ఏమి చేస్తే అధిక ఆదాయం పొందగలరో ఒకసారి ఆలోచించాలన్నారు. అగ్రికల్చర్ క్లినిక్‌లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నుంచి అన్నివిధాల సహకారం అందిస్తామని తెలిపారు. భూసార పరీక్షలు, పంటల సాగు, ప్రకృతి వ్యవసాయంలో రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణా కేంద్రం నోడల్ ఆఫీసర్ పోలవరపు శోభారాణి, కోఆర్డినేటర్ మైనేని నళిని, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎల్వోసీ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే తనయుడు బోడె వెంకట్రామ్

ఎల్వోసీ చెక్కు అందజేత

పెనమలూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కంకిపాడుకు చెందిన పీట్ల నాగరాజుకు వైద్యపరమైన ఖర్చుల నిమిత్తం రూ. 80వేల విలువైన ఎల్వోసీ చెక్కును యువనేత బోడె వెంకట్రామ్ అందజేశారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో దేవినేని రాజా, సలీం, రత్నకుమారి, శివపార్వతి పాల్గొన్నారు.

తెలుగువారి తొలి పండుగ ఉగాది

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

కంకిపాడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : తెలుగువారు తొలి పండుగ ఉగాది అని తహసీల్దార్ భవన్నారాయణ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భవన్నారాయణ మాట్లాడుతూ తెలుగు ప్రజలు కుల, మతాలకు వ్యతిరేకంగా ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించుకుంటారన్నారు. రుతువులు మారుతుంటాయి, వాటితో పాటే అవి మనకు పంచి ఇచ్చే అనుభూతులూ మారుతుంటాయి. ప్రకృతి ఎప్పుడూ నిత్యనూతనంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, సర్వేయర్ భాస్కరరావు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్, ఉగాది పర్వదినం సందర్భంగా ఆదివారం భక్తిశ్రద్ధలతో ఉగాది వేడకలు నిర్వహించారు. జంక్షన్‌లోని పలు ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో భక్తులు మధ్యాహ్నం వరకు క్యూ కట్టారు. ఆలయ ఈవో తారకేశ్వరరావు పర్యవేక్షణలో ఆల యం వెనుక భాగంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఆలయ అర్చకులు రామాచార్యులు పంచాంగ పఠనం చేసి ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారికి ఉగాది సందర్భంగా ఆలయ ట్రస్టీ కాకాని అరుణబాబు దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయంలో అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



కంకిపాడు తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో పాల్గొన్న తహసీల్దార్ భవన్నారాయణ



ఉయ్యూరులో ఉగాది వేడుకల్లో విద్యార్థులు

ఉయ్యూరు : శ్రీవిశ్వావసు సంవత్సర ఉగాది వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలుచోట్ల పంచాగ శ్రవణాలు ప్రత్యేక పూజలు చేశారు. వేణుగోపాలస్వామి, జగదంబా సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో ఉగాది వేడుక నిర్వహించి వేద పండితులతో పంచాగ శ్రవణం గావించారు. ఉయ్యూరు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏజీ అండ్ ఎస్ జీఎస్ జూని యర్ కళాశాల ఆవరణలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో వేద పండితుడు పరాశరం రామకృష్ణాచార్యులు పంచాగ శ్రవణం చేశారు. ఏజీ అండ్ ఎస్ జీఎస్ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియం వద్ద ఉగాది వేడుకలో చింతలపాటి రామకృష్ణ పంచాంగ శ్రవణం చేసి విశ్వావసు సంవత్సరంలో మంచి చెడులను తెలియజేశారు. సోమేశ్వరస్వామి ఆలయంలో పుచ్చా సూర్యప్రకాశ శాస్త్రి పఠనం చేశారు. బ్రాహ్మణ సంక్షేమ సంఘం బాపిరాజు ఆధ్వర్యంలో ఉగాది వేడక, పంచాంగ శ్రవణం గావించారు. ఎంకె ఇంగ్లీషు మీడియం స్కూల్ ఆవరణలో పూజలు చేసి ఉగాది పచ్చడి ప్రసాదంగా పంపిణీ చేశారు. గండిగుంట దత్తాశ్రమంలో జరిగిన వేడుకల్లో సరసభారతి స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గబ్బిట దుర్గాప్రసాద్ పాల్గొని పంచాంగ శ్రవణం చేశారు.



జంక్షన్ అభయాంజనేయస్వామి ఆలయానికి క్యూ కట్టిన భక్తులు

ప్రసాదంపాడు : శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పురస్కరించుకొని రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలు అమ్మవారి దేవస్థానంలో ఆలయ ప్రధాన అర్చకులు ఇనుగంటి లక్ష్మీనరసింహశర్మ పంచాంగ శ్రవణం చేశారు. అనంతరం ఆలయం వద్ద దాతల సహకారంతో ఉచిత మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. ఉగాది వేడుకల్లో భారీగా భక్తులు పాల్గొని పంచాంగ శ్రావణాన్ని ఆలకించారు. అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఈవో ప్రియాంక, టీడీపీ నాయకులు కొల్లా ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు నుంచి పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

ఉంగుటూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : బస్సులో ఫుట్‌బోర్డుపై ప్రయాణం చేస్తున్న దివ్యాంగుడు బస్సు మలుపుతిరుగుతున్న క్రమంలో పట్టుతప్పి బస్సులో నుంచి జారిపడి మృతి చెందిన సంఘటన మండలంలోని ఆత్కూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై చావా సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పెదఅవుటపల్లికి చెందిన అవుటపల్లి ఏసుబాబు (29)అనే దివ్యాంగుడు శుక్రవారం గన్నవరం బస్టాండ్‌లో బస్సు ఎక్కి ఫుట్‌బోర్డుపై కూర్చున్నాడు. హైవే మీదుగా జంక్షన్ వైపు బయలుదేరిన బస్సు పెదఅవుటపల్లి సమీపంలోకి రాగానే సర్వీస్ రోడ్డులోకి మలుపుతిరిగింది. అదే సమయంలో ఫుట్‌బోర్డుపై వున్న ఏసు బాబు పట్టుకోల్పోయి ముందుకు పడ్డాడు. ఈ ఘటనలో ఏసుబాబు తలకు తీవ్రగాయంకాగా కుటుంబసభ్యులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అప్పటినుంచి అపస్మారకస్థితిలో వున్న ఏసుబాబు ఆదివారం తెల్లవారుజామున మరణించాడు. మృతుని సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్సై రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టగుంట సాయంతో బాలుడికి పునర్జన్మ

హనుమాన్‌జంక్షన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : బొమ్ములూరుకు చెందిన చొదిమెల్ల రవికుమార్, రాజకుమారి దంపతుల ఏడాదిన్నర కుమారుడు అశ్విన్ పుట్టుకతో మలద్వారం లేకుండా జన్మించాడు. బాలుడికి క్లిష్టతరమైన ఆపరేషన్ చేయించాల్సి వచ్చింది. ఆర్థిక స్తోమత లేకపోవడంతో బాధితులు పుట్టగుంట సతీష్‌కుమార్‌ను ఆశ్రయించారు. ఆయన స్పందించి ఆంధ్రా ఆసుపత్రి యాజమాన్యం సహకారం తీసుకొని పుట్టగుంట హెల్త్ ఫౌండేషన్ ద్వారా బాలుడికి కొద్ది రోజుల క్రితం ఆపరేషన్ చేయించారు. ఆపరేషన్ అనంతరం కోలుకున్న తరువాత బాలుడితో తల్లిదండ్రులు ఆదివారం పుట్టగుంటను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆపరేషన్ దిగ్విజయంగా నిర్వహించిన ఆసుపత్రి యాజమాన్యానికి, వైద్యులు పీవీ రమణమూర్తి, పీవీ రామారావు, దండమూడి మేఘనలకు పుట్టగుంట కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి గండేపూడి నితీష్‌కుమార్, లయన్స్‌క్లబ్ నాయకులు నందిగం స్వామి, వేగిరెడ్డి నాని, తాడి రంగారావు, చిలకపాటి పండు తదితరులు పాల్గొన్నారు.



పీ4 కార్యక్రమానికి వెలగపూడి వెళ్తున్న పెనమలూరు వాసులు

పీ 4 ప్రారంభోత్సవానికి తరలిన ప్రజలు

పెనమలూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : వెలగపూడిలో జరిగిన పీ4 కార్యక్రమానికి మండలం నుంచి 15 బస్సుల్లో ప్రజలు తరలివెళ్లారు. జిల్లాకు కేటాయించిన 38 బస్సుల్లో భాగంగా పెనమలూరు నుంచి బస్సుల్లో స్థానికులు కార్యక్రమానికి తరలివెళ్లారు. జిల్లా పీడీ వై హరిహరనాథ్ మండలంలో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రణవి, ఏపీఎం కృష్ణంరాజు, ఎస్‌హెచ్‌జీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు : పీ 4 పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆదివారం ఉయ్యూరు మండల పరిధి గ్రామాల నుంచి ప్రజలు వెలగపూడి తరలివెళ్లారు. కలవపాముల, కాటూరు, కడవకొల్లు నుంచి ప్రజలు వెలగపూడి తరలివెళ్లగా ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు.

రోడ్డుకు స్థలం వదలాలి

ప్రహరీ నిర్మాణంపై సీఆర్డీఏ కమిషనర్‌కు ఎండోమెంట్స్ కాలనీ వాసుల ఫిర్యాదు

బెంజిసర్కిల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపాలిటీ పరిధి కానూరు బందరురోడ్డు నుంచి నాగార్జున ఆస్పత్రి వరకు కొంతభాగం రోడ్డుకు స్థలం వదలకుండా ఒక స్థల యజమాని ప్రహరీ నిర్మిస్తున్నారని ఎండోమెంట్స్ పంచాయతీరాజ్ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు కాలనీవాసులైన ఎం. వీరాస్వామి, టీ. కోటిరెడ్డి, జీ. నారాయణరావు, డీ. రామలింగారెడ్డి, వీ. రమేష్, డీ. వీరభద్రరావు, రామారావు, కే. అమరయ్య, శ్రీనివాసరావు, వీ. బ్రహ్మారావులు సీఆర్డీఏ కమిషనర్‌కు లేఖ ద్వారా ఫిర్యాదు పంపారు. ఈ సందర్భంగా వారు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ, ఉడా అప్రూవల్ ప్రకారం బందరురోడ్డు కానూరు నుంచి నాగార్జున ఆస్పత్రి వరకు ఎండోమెంట్స్ కాలనీ మెయిన్ రోడ్డు40 అడుగుల రోడ్డుగా ఉందన్నారు. అయితే బందరురోడ్డు నుంచి ఎండోమెంట్స్ కాలనీ వైపు వచ్చే మెయిన్ రోడ్డు ప్రారంభంలో ఉన్న ప్రైవేటు స్థలాన్ని ఒక వ్యక్తి ఇటీవల కొనుగోలు చేసి రోడ్డుకు స్థలం వదలకుండా ప్రహరీ కడుతున్నారని ఆరోపించారు. దీనివల్ల కాలనీలోకి పెద్ద వాహనాలు రావడం కష్టమవుతుందని, 40 అడుగుల రోడ్డుకు స్థలం వదిలేవిధంగా చర్యలు తీసుకోవాలని వారు సీఆర్డీఏ కమిషనర్‌ను కోరారు. దీనిపై స్థల యజమాని అల్లూరి సాయి ప్రసాద్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా తాను ఇటీవల స్థలం కొనుగోలు చేశామని, రిజిస్టర్ డాక్యుమెంట్ ప్రకారం తన స్థలానికి ప్రహరీ నిర్మించుకుంటున్నామని చెప్పారు. తాను ఈ ఖాళీ స్థలంలో నిర్మాణాలు చేపడితే సీఆర్డీఏ నిబంధనల ప్రకారం రోడ్డుకు స్థలం వదిలేస్తామని పేర్కొన్నారు.



రోడ్డుకు స్థలం వదలకుండా నిర్మించిన ప్రహరీ

నిత్యావసరాలు పంపిణీ

కంకిపాడు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుధ్య సిబ్బంది చేస్తున్న కృషి అభినందనీయమని మాజీ ఎంపీపీ దేవినేని రాజా అన్నారు. ఈడుపుగల్లు గ్రామస్థులు వల్లభనేని రాంబాబు 74వ జన్మదినోత్సవం సందర్భంగా పారిశుధ్య సిబ్బందికి ఆదివారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ ఎంపీపీ దేవినేని రాజా మాట్లాడుతూ, పారిశుధ్య కార్మికుల శ్రమను గుర్తించి రాంబాబు వారికి నిత్యావసరాలు పంపిణీ చేయడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం

గన్నవరం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరి దైనందిక జీవితంలో రోజువారి నడకతో సంపూర్ణ ఆరోగ్యంమని సీఐ బీవి శివప్రసాద్ అన్నారు. స్థానిక బాలుర జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ విశ్వవసు నామ సంవత్సర ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించారు. వాకర్స్ డిస్ట్రిక్ గవర్నర్ ఎస్ సుబ్బారావు, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, జడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, మాట్లాడారు. తొలుత క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేయనున్న బోర్‌వెల్ పనులకు శంకుస్థాపన చేశారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు తిరివీధి వెంకయ్య, కార్యదర్శి సగ్గుర్తి శ్రీనివాసరావు, హెచ్‌ఎం జీవి రవిబాబు, డి.పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు టి.శ్రీను, సీనియర్ వాకర్స్ ముక్కామల సుబ్బారావు, చిమట రామారావు, కోటేశ్వరరావు, సీహెచ్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

సీతారామ కల్యాణ మహోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా

పామర్రు,మార్చి30(ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లాలలో ప్రసిద్ధిచెందిన హనుమత్ దేవాలయాల్లో ఒకటైన పామర్రులోని ఉండ్రపూడి- పోలవరం క్రాస్ రోడ్డులో గల వీరాంజనేయ స్వామి దేవాలయంలో ఏప్రిల్ 5నుంచి 7వరకు జరగనున్న సీతారామ కల్యాణమహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం స్థానిక ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజాకు మొదటి ఆహ్వానపత్రికను ఆలయ అధికారి పీవీఎస్‌వీ ప్రసాదరావు అందించారు. అనంతరం కల్యాణమహోత్సవ గోడ పత్రికలను ఆవిష్కరింపజేశారు. స్వామి కల్యాణ మహోత్సవ ఉత్సవకమిటీ సభ్యులు తాడిశెట్టి వేంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, దాడిపవన్, ఈడేగంటేశ్వరరావు, ఎంపీటీసీ సుబ్బారావు, వెంకయ్య పాల్గొన్నారు.

దారం మృతి బాధాకరం

గుడివాడ, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు దారం నరసింహరావు అకాల మృతి పట్ల ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదివారం ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో గుడివాడలో టీడీపీ విజయానికి దారం అందించిన సహకారం మరువలేనిదన్నారు. సోదర సమానుడైన దారం మృతి బాధాకరమన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని, ఆయన కుటుంబసభ్యులకు భగవంతుడు మనోధైర్యం కల్పించాలని ఆకాంక్షించారు. దారం కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందని ఎమ్మెల్యే వెనిగండ్ల భరోసా ఇచ్చారు.

ఘనంగా షడ్రుచుల ఉగాది



వేదపండితులను సత్కరిస్తున్న ఈఓ గోపాలరావు

గుడివాడ, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : తెలుగు వారి సంవత్సరాది విశ్వావసు నామ సంవత్సరం నియోజకవర్గ ప్రజలందరికీ శుభాలను కలిగించాలని, సుఖసంతోషాలతో వర్థిల్లాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదివారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. గుడివాడ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కోరారు. ఆదివారం స్థానిక వాసవీచౌక్ వద్ద గల కళ్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద కొనకళ్ల ట్రస్ట్ ఆధ్వర్యంలో చైర్మన్ కొనకళ్ల సీతయ్య భార్య వెంకటేశ్వరమ్మ జ్ఞాపకార్థం భక్తులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు సూరే గాంధీ, ఆర్యవైశ్య కళ్యాణ మందిరం అధ్యక్షులు పోకూరి మోహనరావు, తిరుపతయ్య, సామి రామ్మోహనరావు, చెక్క ఉమాశంకర్, బొప్పన కుటుంబరావు పాల్గొన్నారు.

స్థానిక భీమేశ్వరస్వామి దేవస్థానంలో విశ్వావసు నామ సంవత్సర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాంగ శ్రవణం గావించి భక్తులకు పంచాంగాలను అందజేశారు. అనంతరం దేవస్థాన కార్యనిర్వహణాధికారి కె.వి గోపాలరావు వేదపండితులు భైరవబట్ల విజయకుమార్, కొచ్చెర్లకోట నారాయణలను ఘనంగా సత్కరించారు.

ఉగాదిని పురస్కరించుకుని స్థానిక విఘ్నేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం దంపతులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

గుడివాడ : సమాజంలో సాహిత్యం అంతర్భాగమని తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ కె.రామశివ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్‌జీవోస్ హోంలో భారతి సమితి ఆధ్వర్యంలో విశ్వావసు నామ సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రుద్రపాక తెలుగు ఉపాధ్యాయురాలు, పద్యకవి శిరోమణి పి.వి.ఎన్.వి రాజకుమారి రచించిన "వాణీ శతకం" పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ కొడాలి సోమసుందరరావు పంచాంగ శ్రావణం గావించారు. డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఆంజనేయులు, సమితి అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, మాదవరావు, ఉపాధ్యక్షులు రాఘవాచారి, కోశాధికారి వెంకటేశ్వరరావు, రూప, ఎంపీడీవో బి.వై విష్ణుప్రసాద్, ఎన్‌జీవోస్ అసోసియేషన్ గుడివాడ తాలుకా కార్యదర్శి జి.రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గుడివాడరూరల్: చిన ఎరుకపాడులోని అష్టలక్ష్మీ ఆలయంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. దొండపాడు, బొమ్ములూరు శివాలయాలు భక్తులు కిటకిటలాడాయి.

గుడ్లవల్లేరు : విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను పురస్కరించుకుని వేమవరం కొండాలమ్మ అమ్మవారి ఆలయాన్ని ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించారు. ఈ సందర్భంగా వేదపండితునిచే ఆలయ అలవేటి మండపంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడితో పాటుగా పంచాంగాలను పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు పర్యవేక్షించారు.

గుడ్లవల్లేరు వేపుగోపాల స్వామివారి ఆలయంలో ఆదివారం సాయంత్రం మండల బ్రాహ్మణ సంఘం, ఆలయ నిర్వాహక కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య చైర్మన్ వల్లభనేని సీతారామ్ తదితరులు పాల్గొన్నారు.

పామర్రు: ఉగాదిని పురస్కరించుకుని వేకువజామునే గృహిణిలు చిన్నారులుతలంటు స్నానాలచరించి ఇంటాల్లిపాది నూతన వస్త్రాలను ధరించి లక్ష్మీదేవి పూజలు జరుపుకుని షడ్రుచుల ఉగాది పచ్చడిని అందరికీ పంచారు. ఇంటి గుమ్మాలకు పచ్చని మామిడితోరణలతో అలకంరించారు. వేడుకల్లో భాగంగా పామర్రు పరిధిలోని గ్రామాల్లో గృహిణులు, యవతులు, తమవాకిళ్లలో విశ్వావసు నామ తెలుగునూతన సంవత్సరానికి ఆదివారం స్వాగతం పలుకుతూ రంగవల్లులను తీర్చిదిద్దారు. స్థానిక ఫైరుస్టేషన్ సమీపంలో నెరుసువారి వీధిలో గృహిణులు మామిడికాయల ఆకృతులతో తీర్చిదిద్దిన ముగ్గులుకు పలువురు ప్రశంసలు లభించాయి. పలు దేవాలయాల్లో భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



పెదపారుపూడిలో పంచాంగ శ్రవణం గావిస్తున్న అర్చకులు



కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో పంచాంగశ్రవణంలో పాల్గొన్న భక్తులు

పామర్రులో ఆదివారం ప్రజలంత విశ్వావసునామ సంవత్సర ఉగాది పర్వాదినాన్నిఘనంగా జరుపుకున్నారు. దేవాలయల్లో ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. ఉండ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్దగల వీరాంజనేయ స్వామి ఆలయంలో ఉగాదిని పురస్కరించుకుని పలుగ్రామాలనుంచి విశేషసంఖ్యలో భక్తులు హజరై ప్రత్యేకపూజాదికాలు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఉగాది పంచాంగ శ్రావణాలు ఆలయాధికారి ప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించారు. అనంతరం భక్తులకు దాతల వితరణతో తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, బేతనబోట్లఫణి, సుబ్బారావుశర్మలు పాల్గొన్నారు. ఇదేవిధంగా రాపర్ల అడ్డరోడ్డు వద్దగల గణ్య వేంకటేశ్వరస్వామి, నిమ్మకూరు, పేరిశేపల్లి వేంకటేశ్వరస్వామి దేవస్థానాలతోపాటు పలు ఆలయాల్లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడిని అర్చకులు అందజేశారు.

పెదపారుపూడి: ఉగాది పండుగను పురస్కరించుకుని వెంట్రప్రగడ గ్రామంలో 67వ వసంత నవరాత్ర మహోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వెలగపూడి సత్యానారాయణ - దుర్గ సంధ్య దంపతులు పీటలమీద కూర్చుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు వేణుగోపాలస్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు నిర్వహించారు. వేదపండితుడు ఉగ్ర నరసింహాచార్యులు ఉగాది పంచాంగం చెప్పారు.



తోట్లవల్లూరు వేణుగోపాలస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం చెబుతున్న వేదపండితుడు నరసింహాచార్యులు

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పారిశుధ్య కార్మికురాలికి వస్త్రాలు అందజేస్తున్న వెంకట సత్యనారాయణ

పెద పారుపూడి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): యలమర్రు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అమరావతి సేవ ఫౌండేషన్ తరపున ఫౌండేషన్ వ్యవస్థాపకులు యలమర్రు గ్రామ ఉపసర్పంచ్ సూరపనేని వెంకట సత్యనారాయణ , అట్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మన స్వచ్ఛత - మన గౌరవం అనే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా యలమర్రు గ్రామ పంచాయతీ పారిశుధ్య , కాంట్రాక్ట్ వర్కర్స్ 18 మందికి దుస్తులు , చేతి ఖర్చుల కింద ఒక్కొక్కరికి రూ.500లు పంపిణీ చేశారు. అనంతరం వారందరికీ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పంచాయతీ కార్యదర్శి డీసీహెచ్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



లక్ష్మణరావుకు ఆర్థిక సాయం అందజేస్తున్న జనసేన నాయకులు రామిశెట్టి మురళీమోహన్

జనసేన బలోపేతమే ధ్యేయం

గుడివాడ, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : జనసేన బలోపేతానికి పార్టీ నాయకులందరూ ఏకతాటిపైకి రావాలని శుభంకర మానవ మహోదయ క్షేత్రం వ్యవస్థాపకులు రామిశెట్టి మురళీమోహన్ కోరారు. ఆదివారం స్థానిక ఆంజనేయపేటలోని కార్యాలయంలో జనసేన ఐక్యవేదిక నిర్వహించారు. సంస్థ 30వ వార్షికోత్సవం సందర్భంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మాజీ విలేకరి కె.లక్ష్మణరావుకు జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ చేతుల మీదగా రూ.5,000లు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా ఐకమత్యంగా ఉండాలని మురళీమోహన్ కోరారు. ఈ కార్యక్రమంలో పాలంకి సారథి, సందు పవన్, కందుల రవి, మజ్జి శ్రీనివాసరావు, సాయన రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కోదండ రామస్వామి విగ్రహ ప్రతిష్ఠకు సర్వం సిద్ధం

గుడివాడ రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): దొండపాడులో కోదండ రామస్వామి దేవాలయం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవానికి ఆలయ భక్త బృందం గత పది రోజుల నుంచి అహోత్రాలు కష్టపడుతున్నారు. ఒకేరాయితో కోదండ రామ స్వామి దేవాలయం నిర్మించారు. ఎన్‌ఆర్ఐలు, గ్రామంలో అత్యంత స్థిరపడిన యువకులు విరాళాల సహాయ సహకారాలతో గ్రామస్థుల సహకారంతో కోదండ రామాలయం పనులు జరిగాయి. ఆలయ భక్తబృందం ఏర్పడి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అత్యద్భుతంగా ఆలయాన్ని నిర్మించారు. ఆలయాన్ని చూడటానికి చాలా మంది వస్తున్నారు. కోదండ రామస్వామి దేవాలయంలో ఏప్రిల్ 2నుంచి ప్రారంభమై ఏప్రియల్ 9 బుధవారం వరకు ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ అభివృద్ధికమిటీ సభ్యులు తెలిపారు.గుడివాడ చుట్టూపక్కల ప్రజలు, భక్తులు తరలిరావటానికి ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.



నూతనంగా నిర్మించిన కోదండ రామస్వామి దేవాలయం

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పామర్రు, మార్చి30 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం-విజయవాడ ప్రధాన రహదారిపై కురుమద్దాలి రొయ్యల ప్యాక్టరీ సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. పమిడిముక్కల మండల పరిధిలోని ముళ్ల ఐనంపూడి, వేల్పూరు గ్రామాలకు చెందిన రత్నం నటరాజ్(17), పిప్పళ్ల అర్జునరావులుతోపాటుగా గుడ్లవల్లేరుకు చెందిన డోకిపర్తి వేంకటేశ్వరరావు(45)లు వేర్వురు మోటారు సైకిళ్లపై పామర్రుకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో వెనుకనుంచి వేగంగా వస్తున్న కారు వారి బైకులను ఢీకొంది. దీంతో వేర్వురు మోటారుసైకిళ్లపై పయనిస్తున్న ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన కారు నడిపే వ్యక్తులు కారును అక్కడే వదిలేసి పరారయ్యారు. స్థానికుల ఇచ్చిన సమాచారంతో 108 అంబులెన్సు ద్వారా క్షతగాత్రులను బందరు ఆస్పత్రికి తరలించారు. అయితే నటరాజ్ పరిస్థితి విషమించడంతో బందరునుంచి మెరుగైన చికిత్స కోసంవిజయవాడకు తరలించారు. ఈమేరకు సంఘటన స్థలానికి చేరుకున్న ఎఎస్సై జి.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బైకులను ఢీకొట్టి రోడ్డుపై ఈడ్చుకుపోయిన కారు

పాడి రైతులకు సేవలందించడమే లక్ష్యం



సమావేశంలో పాల్గొన్న పలువురు అధ్యక్షులు

గుడ్లవల్లేరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : రైతులకు బాసటగా నిలిచేందుకు ఎంత ప్రతికూల వాతావరణాలు ఉన్నప్పటికీ రైతుల పక్షాన ఎల్లపుడూ నిలిచే కృష్ణా మిల్క్ యూనియన్ మరోసారి రైతులకు బోనస్ ఇవ్వడం అభినందనీయమని పలువురు పాల ఉత్పత్తిదారుల సంఘాల అధ్యక్షులు అన్నారు. వేమవరం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సమావేశానికి వేమవరం సంఘ అధ్యక్షులు అబ్దుల్ బషీర్ అధ్యక్షతన నిర్వహించారు. 2024 డిసెంబర్ నుంచి 2025 మార్చి వరకూ మూడు మాసాలకు రూ.18 కోట్లు బోనస్‌ను ఇచ్చేందుకు పాలకవర్గం నిర్ణయం తీసుకోవడం హర్షదాయకమన్నారు. గుడ్లవల్లేరు పాలశీతలీకరణ కేంద్రం పరిధిలోని పలువురు సంఘ అధ్యక్షులు పాల్గొని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వర్‌బాబు, పాలకవర్గానికి సంఘాల పాలకవర్గాలు,అధ్యక్షలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలు సంఘాల అధ్యక్షులు రావి ప్రసాద్, అబ్దుల్ బషీర్, దారం శ్రీనివాసరావు, నల్లమోతు నాగరాజు, కోటప్రోలు వెంకట రంగారావు, అచ్యుత నాగ వెంకటేశ్వరరావు, కొణతం కృష్ణ, మోదుగుమూడి అమలేశ్వరరావు, రహంతుల్లా పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ మృతి

పామర్రు, మార్చి30 (ఆంధ్రజ్యోతి) : పామర్రు మండల సీనియర్ సిటిజన్, వీరాంజనేయస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ చిమటా సూర్యనారాయణ(78) శనివారం రాత్రి అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయనకు ముగ్గురు సంతానం కాగా పెద్ద కుమారుడు విశ్రాంత ఎంఈవో సుబ్రమణ్యశ్వరరావుగా పనిచేశారు. మిగిలిన ఇరువురు ఇతర దేశాల్లో స్థిరపడ్డారు. సూర్యనారాయణ ఉండ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్దగల వీరాంజనేయస్వామి ఆలయ చైర్మన్‌గాను, సీనియర్ సిటిజన్స్ సంఘ అధ్యక్షుడిగా సేవలందించారు. ఆయన మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తంచేశారు.



చిమటా సూర్యనారాయణ

ఉత్సవ కమిటీ సభ్యుల నియామకం

గుడివాడ రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మోటూరులో వేంచేసియున్న సీతారామ స్వామి ఆలయంలో ఈ నెల 6వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా అదే గ్రామానికి చెందిన 8 మందిని ఉత్సవ కమిటీ సభ్యులుగా ప్రభుత్వం నియమించింది. మోటూరు ఆలయ కార్యదర్శి గొరిపర్తి మౌనిక ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించే కాలంలో ఉత్సవ కమిటీ సభ్యులు పని చేయాల్సి ఉంది. ఆలయ వ్యవస్థాపక కుటుంబసభ్యులు శ్రీమాన్ శ్రీరంగం నల్లాన్ చక్రవర్తుల, తిరుమలాచార్యుల అయ్యంగార్ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులుగా ఆనందాసు వెంకట రామయ్య నాయుడు, మానేపల్లి సురేష్, గంటా వంశీ, గంగనపల్లి రాజ్యలక్ష్మి, యార్లగడ్డ నాగమణి, కోడూరు సుధారాణి, గురువెల్లి సంతోషిణి, పంతగాని స్వాతిలను నియమించారు. ఆదివారం రాత్రి ఉగాది సందర్భంగా దేవాలయానికి వెళ్లి ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సీతారామస్వామి దేవాలయంలో ఉత్సవ కమిటీ సభ్యులు

బాటసారుల దాహార్తిని తీర్చడమే ధ్యేయం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ నాగప్రసాద్

గుడివాడ, మార్చి 30(ఆంధ్రజ్యోతి) : వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేలా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయాలని టూటౌన్ సీఐ చిన్ని నాగప్రసాద్ కోరారు. ఆదివారం స్థానిక బంటుమిల్లి రోడ్డులోని శ్రీనివాస్ సెంటర్‌లో కంచర్ల సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం మణికంఠ నాగరాజు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిటైల్ కిరాణ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు కొత్త వీరయ్య, ప్రముఖ వ్యాపారవేత్త కొత్త కుమారస్వామి, వ్యాపారులు చిన్న పెంటయ్య, పెదపెంటయ్య, ఏల్చూరి ఫణికుమార్, ప్రకాష్, వడ్డాది రాము, పవ్పుజనసేన నాయకులు పెద్ది కిషోర్‌పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	162, 171, 182
చికెన్ విత్ స్కిన్	310
చికెన్ స్కిన్‌లెస్	320

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 460

46వ డివిజన్‌లో టీడీపీ కార్యాలయం ప్రారంభం



మచిలీపట్నం టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 46వ డివిజన్‌లో టీడీపీ కార్యాలయాన్ని ఆదివారం మంత్రి కొల్లు రవీంద్ర ప్రారంభించారు. టీడీపీ సీనియర్ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్, నాయకులు బత్తిన దాసు, పల్లపాటి సుబ్రహ్మణ్యం, పిప్పళ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు




సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో విశ్వనాథ సుబ్రహ్మణ్య శర్మ పంచాంగ శ్రవణం, పక్కన సత్కరిస్తున్న బుద్ధప్రసాద్



శంకరమఠంలో సత్కారం అందుకున్న బ్రాహ్మణ ప్రముఖులు



అవనిగడ్డ గాంధీక్షేత్రంలో విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

వైభవంగా విశ్వావసు ఉగాది వేడుక

● కవులు, బ్రాహ్మణ ప్రముఖులకు సత్కారం ● ఆలయాల్లో విశేష పూజలు, పంచాంగ శ్రవణం

మోపిదేవి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం, పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామి దేవస్థానాల్లో దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఆలయ వేదపండితులు నౌడూరి విశ్వనాథ సుబ్రహ్మణ్య శర్మ పంచాంగ శ్రవణం గావించారు. విశ్వావసు నామ సంవత్సరంలో ప్రజలు సుఖ సంతోషాలతో విరాజిల్లుతారన్నారు. చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల తరపున శ్రీకాకుళం దేవస్థానం అర్చకులు భాస్కరాచార్యులు, వేదపండితులు నౌడూరి విశ్వనాథ సుబ్రహ్మణ్య శర్మలను సత్కరించి ప్రోత్సాహకాన్ని అందజేశారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సతీమణి మండలి విజయలక్ష్మి, కుమారుడు వెంకట్రామ్ దంపతులు, శీలం అశ్విన్ దంపతులు ఉగాది వేడుకల్లో పాల్గొన్నారు. వేసవిని దృష్టిలో పెంచుకుని భక్తుల సౌకర్యార్థం దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావు ప్రారంభించారు. ఆదివారం భక్తులకు మజ్జిగను అందజేశారు.

నిత్యకల్యాణంలో పాల్గొనే భక్తులకు స్వామివారి చిత్రపటం

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో జరిగే నిత్యకల్యాణంలో పాల్గొన్న దంపతులకు స్వామివారి చిత్రపటాన్ని బహూకరణగా అందించే కార్యక్రమాన్ని ఉగాది నుంచి ప్రారంభించారు. స్వామి వారి నిత్య కల్యాణం రూ.1250 టిక్కెట్ కొనుగోలు చేసి కల్యాణంలో పాల్గొనే పురుషులకు శేషవస్త్రం, మహిళలకు జాకెట్ ముక్క, లడ్డూ అందిస్తున్నారు. ఉగాది సందర్భంగా స్వామివారి చిత్రపటాన్ని అందజేయటాన్ని ప్రారంభించారు. ప్రధాన అర్చకులు బుద్దు పవన్ కుమార్ శర్మ, వేదపండితులు నౌడూరి సుబ్రహ్మణ్య శర్మ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ ప్రముఖులకు సత్కారం

మచిలీపట్నం టౌన్ : ఉగాది జీవితంలోని మంచి చెడులను ప్రతిబింబిస్తుందని ప్రముఖ వైద్యుడు, బ్రాహ్మణ సేవా సంఘం నాయకుడు బి. ధన్వంతరీ ఆచార్య అన్నారు. ఆదివారం గొడుగుపేట శంకరమఠంలో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో విశ్వావసు ఉగాది వేడుకలు నిర్వహించారు. బ్రహ్మశ్రీ విష్ణుభొట్ల సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. అనంతరం బ్రాహ్మణ ప్రముఖులు విష్ణుభొట్ల సూర్యనారాయణ శర్మ, వేమూరి రామకృష్ణారావు, బి.ధన్వంతరీ ఆచార్య, ఏ.ఆర్.కె.మూర్తి, జె.మల్లికార్జున ప్రసాద్, జమ్ములమడక సేతు రామయ్య, సింగరాజు గోవర్దన్‌లను ఘనంగా సత్కరించారు.

బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు వింజమూరి శివరాం, మోపర్తి సుబ్రహ్మణ్యం, వడ్లమన్నాటి మారుతీ దివాకర్, పి.వి. ఫణికుమార్, కాళీపట్నపు రఘు, అంబటిపూడి సుబ్రహ్మణ్యం, డి.వి.రమణరావు, చోడవరపు లక్ష్మీప్రసూన, గురజాడ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. **పెడన రూరల్** : మండలంలోని ప్రజలు ఉగాది వేడుక ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వావసు నామ సంవత్సర పంచాం గ శ్రవణం చేశారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్ తదితరులు ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. **అవనిగడ్డ** : అవనిగడ్డలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. గాంధీక్షేత్రంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ నేతృత్వంలో ఉగాది వేడుకలు జరుగుగా, మోపిదేవి ఆలయ ఘనాపాటి నౌడూరి విశ్వనాథ సుబ్రహ్మణ్య శర్మ పంచాంగ శ్రవణం గావించారు. గాంధీక్షేత్రంలో జరిగిన సాంస్కృతి ప్రదర్శనలో బాలబాలికలు తమ నృత్యాలతో అలరించారు. అనంతరం కర్రసాము, తదితర గ్రామీణ క్రీడల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్, అల్లుడు శీలం అశ్విన్ కుమార్ పాల్గొన్నారు. **చల్లపల్లి** : విశ్వావసు నామ సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పూజ లు చేశారు. సంపటాలమ్మ ఆలయం, వేంకటేశ్వరస్వామి ఆలయం, కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. **నాగాయలంక** : ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. విశ్రాంత సైనికోద్యోగి గొరుముచ్చు బాబురావు, కుటుంబసభ్యుల ఆర్థిక సౌజన్యంతో 50 మందికి అన్నదానం జరిగింది. పొన్నంపల్లి చిన్నా, ఆకురాతి బాబురావు తదితరులు పాల్గొన్నారు.



వెంకట శైలజకు ఉగాది పురస్కారం

ప్రముఖ కవయిత్రి పల్లావఝుల వెంకట శైలజ విశ్వావసు ఉగాది పర్వదినం సందర్భంగా వేంకటేశ్వర స్వామి కల్యాణ మండపంలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ డీకే బాలాజీ, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు చేతుల మీదుగా ఉగాది పురస్కారం అందుకున్నారు. వెంకట శైలజను బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు వేమూరి రామకృష్ణారావు, సీనియర్ న్యాయవాది కె.ఎస్.ఆర్.హేమంత్‌కుమార్, టీడీపీ బ్రాహ్మణ సాధికార కమిటీ జిల్లా కన్వీనర్ పి.వి.ఫణికుమార్ అభినందించారు.



గంగానమ్మ జాతరకు పూర్తిస్థాయి ఏర్పాట్లు

కోడూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): భక్తుల ఇలవేల్పుగా పూజలు అందుకుంటున్న గంగానమ్మ 50వ జాతర మహోత్సవానికి పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు తెలిపారు. ప్రధాన జాతర నేపథ్యంలో భక్తులు మొక్కులు తీర్చుకునేందుకు ,అమ్మవారిని దర్శించేందుకు ఆలయం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. డీఎస్పీ విద్యశ్రీ, సీఐ యువకుమార్ ఆధ్వర్యంలో 80 మంది పోలీసు సిబ్బందితో ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై చాణిక్య తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వై ద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పీహెచ్‌సి వైద్యాధికారి శిరీష తెలిపారు. ఏప్రిల్ 1, 2, 3 తేదీల్లో ఆలయ ప్రాంగణంలో పాల పొంగళ్లు, మహాచండీయాగం, భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నట్లు యుగంధర్ తెలిపారు. గంగానమ్మ అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా సాగుతోంది. ఆదివారం వేటపాలెం, వడ్డెరపాలెం, కోడూరు 1, 2, 3, 5 వార్డులలో గ్రామోత్సవం కొనసాగినట్లు ఆలయ ధర్మకర్త కోట యుగంధరరావు తెలిపారు.



లగ్న పత్రికను ఈవోకు అందజేస్తున్న రామఫణి శర్మ

లంకమ్మ వార్షిక జాతర మహోత్సవం 12న

అవనిగడ్డ, మార్చి, 30 (ఆంధ్రజ్యోతి): దివిసీమ ప్రజల ఇలవేల్పు లంకమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఈనెల 12వ తేదీన జరుగనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావు తెలిపారు. దేవాలయ సిద్ధాంతి కవితా రామఫణి శర్మ అమ్మవారి జాతర మహోత్సవానికి సంబంధించి లగ్న పత్రికను ఆదివారం ఆలయ ఈవోకి అందజేశారు. ఏప్రిల్ 6వ తేదీ ఉదయం 11 గంటల 45 నిముషాలకు అమ్మవారిని గ్రామోత్సవానికి తీసు కెళ్లాలని నిర్ణయించారు. అప్పటి నుంచి 11వ తేదీ వరకు అమ్మ వారు గ్రామంలో ఊరేగుతారని, 12వ తేదీ ఉదయం 11.45 ని ముషాలకు తిరిగి ఆలయానికి చేరుకుంటారని ఆలయ ఈవో తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కుటుంబసభ్యులు మండలి విజయలక్ష్మి, మండలి వెంకట్రామ్, సాయి సుప్రియ, శీలం అశ్విన్ కుమార్, శీలం కృష్ణప్రభ తదితరులు పాల్గొన్నారు. ఈవోని కార్యనిర్వహణాధికారిని ఘనంగా సత్కరించారు.



కొంగంచర్లలో వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

పెడన రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పర్ణశాల ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో కొంగనచర్ల గ్రామంలోని హెబ్రోను ప్రార్థనా మందిరం ఆవరణలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మచిలీపట్నానికి చెందిన డాక్టర్ యనమండ్ర సాయి శ శాంక్, యక్కటి ప్రవళిక 150 మంది రోగులను పరీక్షించారు. చర్చి ఆధ్వర్యంలో రూ.30 వేల విలువైన మందులను ఉచితంగా అందజేశారు. గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పర్వదినాల సందర్భంగా వైద్యశిబిరం నిర్వహించారు. పాస్టర్ పి.ఎస్.రాజు, రమేష్, వెంకటరత్నం, కిరణ్, సుకన్య, ప్రదీప్, ప్రవీణ్, ప్రశాంత్, తరుణ్, సంఘ విశ్వాసులు పాల్గొన్నారు.

ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి

మచిలీపట్నం టౌన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : దైవజనులు పగడాల ప్రవీణ్ మృతిపై ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ ఆదివారం మచిలీపట్నంలో క్రైస్తవులు భారీ ర్యాలీ నిర్వహించారు. లక్ష్మీటాకీసు సెంటర్ నుంచి కోనేరుసెంటర్ వరకు మోటారు బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. దోషులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్రైస్తవ మత పెద్దలు, దైవజనులు పాల్గొన్నారు. **చల్లపల్లి** : క్రైస్తవ మత ప్రచారకుడు పగడాల ప్రవీణ్ మృతిపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టాలని దైవసేవకులు డిమాండ్ చేశారు. చల్లపల్లి ఏరియా దైవజనుల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం చల్లపల్లిలో నిరసన ర్యాలీ జరిగింది. చల్లపల్లి రాజా కళాశాల వద్ద నుంచి ప్రారంభమైన ర్యాలీ ప్రధాన సెంటరు మీదుగా బస్టాండ్ సెంటరు వరకు, తిరిగి చల్లపల్లి ప్రధాన సెంటర్ చేరింది. కొవ్వొత్తులు వెలిగించి ప్రవీణ్ మృకి తిసంతాపం తెలిపారు. దైవసేవకులు మాట్లాడుతూ, పగడాల ప్రవీణ్ మృతిపై క్రైస్తవుల్లో ఎన్నో అనుమానాలున్నాయన్నారు. ఉయ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేశారు. విశ్రాంత డీఎస్పీ కె.హరిరాజేంద్రబాబు, పాస్టర్ ఎం.మరియకుమార్, పి.దేవదానం, వి.సాల్మన్ రాజు, జి.ప్రదీప్‌కుమార్, తాతా సత్యమూర్తి, గోల్కొండ ఏసురాజు, పి.ఏసుదాసు, జి.డేవిడ్‌ల తోపాటు మోపిదేవి, ఘంటసాల మండలాల పాస్టర్లు, క్రైస్తవులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



బందరు శాంతి ర్యాలీలో మాట్లాడుతున్న మత పెద్దలు



చల్లపల్లిలో క్రైస్తవుల నిరసన ర్యాలీ



ప్రవీణ్‌కు నివాళి

ఘంటసాల : పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి అత్యంత బాధకరమని పాస్టర్ మొండితోక ప్రసాదరావు అన్నారు. దిరిశంవాని పెద్ద గూడెం బాపిస్టు చర్చి వద్ద పగడాల ప్రవీణ్ ఫ్లెక్సీకి నివాళులర్పించారు. మొండితోక ప్రసాదరావు మాట్లాడుతూ ఎంతో మందిని ప్రభువు మార్గంలో నడిపించిన గొప్ప దైవజనులు ప్రవీణ్ పగడాల అన్నారు. పాస్టర్ మొండితోక సునీల్, గ్రామస్థులు టైలర్ శ్రీను, దిరిశం రవి బాబు, కొడాలి శ్యామ్యూల్, మట్టా సోమేశ్వర రావు, కొడాలి రాజేష్, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు. కాగా, పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతికి నిరసనగా మంగళవారం ఉదయం 10 గంటలకు మం డల పాస్టర్ల ఆధ్వర్యంలో ఘంటసాల సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు జరిగే శాంతియుత ర్యాలీని విజయవంతం చేయాలని పాస్టర్లు పిలుపునిచ్చారు. గిల్లాలు బేతులు చర్చిలో సమావేశం నిర్వహించారు.

వేణుగోపాలరావుపై వైసీపీ కౌన్సిలర్ల ఆరోపణలు నిరాధారం : టీడీపీ నేతల ఖండన



పెడన, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నేత బొడ్డు వేణుగోపాలరావుపై వైసీపీ కౌన్సిలర్లు పెడన మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశంలో రాజకీయ దురుద్దేశంతోనే నిరాధారమైన ఆరోపణలు చేశారని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. టీడీపీ సీనియర్ నేత అనుముల పూర్ణచంద్రరావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు యక్కల శ్యామలయ్య, వహబ్‌ఖాన్, కమ్మగంటి బాబు, యర్రా నాగరాజు, తమ్మా బీమయ్య, పరసా జితేంద్ర, సేనాపతి అజయ్, ఎలిగట్ల ప్రసాద్, కౌన్సిలర్లు మట్టా శివపావని, బళ్ళ పద్మావతి మాట్లాడారు. మునిసిపల్ చట్టం ప్రకారం అత్యవసర సమావేశం జరుగుతుండగా అప్పటికప్పుడు టేబుల్ ఎజెండా పెట్టకూడదన్నారు. ఈ విషయం తెలిసి కూడా వైసీపీ కౌన్సిలర్లు టేబుల్ అజెండా పెట్టాల్సిందేనంటూ కమిషనర్‌పై తీవ్ర వత్తిడి తెచ్చి వేధించారని ఆరోపించారు. ఒక వ్యక్తిని కించపరుస్తూ అతనిపై చర్యలు తీసుకోవాలంటూ అజెండాలో అంశం పెట్టడం కూడా చట్టవిరుద్ధమన్నారు. ఆక్రమణకు గురైనట్టు చెబుతున్న 18 సెంట్ల స్థలాన్ని తహసీల్దార్ స్వాధీనం చేసుకుని హద్దులు నిర్ణయించి మునిసిపాలిటీకి అప్పగించడం వైసీపీ కౌన్సిలర్లకు తెలియదా అని ప్రశ్నించారు. ఎప్పుడో పరిష్కారమైపోయిన అంశాన్ని వైసీపీ కౌన్సిలర్లు ఇప్పుడు తెరపైకి తీసుకురావడంలో కుట్ర కోణం ఉందన్నారు. 18 సెంట్ల స్థలాన్ని వేణుగోపాలరావు ఆక్రమించుకుని అమ్మేశారనడం పచ్చి అబద్ధమని, ఆయన అటువంటి నాయకుడు కాదని వారు స్పష్టం చేశారు. గతంలో స్థలాన్ని స్వాధీనం చేసుకునే సమయంలో అధికారులు చేసిన సర్వే లోపభూయిష్టంగా ఉందని వారు ఆరోపించారు. సర్వే శాస్త్రీయంగా జరగలేదన్నారు. రైతులకు నోటీసులు ఇవ్వకుండా వైసీపీ నాయకుల ఒత్తిడికి లొంగిన అధికారులు హడావుడిగా ఏకపక్షంగా సర్వే చేసి స్థలం ఆక్రమణకు గురైనట్టు ప్రకటించేశారన్నారు. 18 సెంట్ల స్థలం ఆక్రమణ విషయమై అధికారులు శాస్త్రీయమైన సర్వే చేసి ఆక్రమణ జరిగిందో లేదో తేల్చాలని డిమాండ్ చేశారు. వైసీపీ నాయకులు చేస్తున్న కుట్రలను తాము సంఘటితంగా ఎదుర్కొంటామని హెచ్చరించారు.



తాగునీటి సరఫరాకు మండలి ఫౌండేషన్ వాటర్ ట్యాంకర్ ఏర్పాటు

అవనిగడ్డ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వేసవిలో దివి ప్రాంతంలోని తీర గ్రామాల్లో తాగునీటి ఎద్దడిని నివారించేందుకు మండలి ఫౌండేషన్ ముందుకు వచ్చింది. ఉగాది సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, ఆయన సతీమణి మండలి విజయలక్ష్మి మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 20 వేల లీటర్ల సామర్థ్యం వాటర్ ట్యాంకర్‌ను లాంఛనంగా ప్రారంభించారు. తాగునీటి ఎద్దడిని నివారించేందుకు వాటర్ ట్యాంకర్‌ను సిద్ధం చేసినట్లు ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ తెలిపారు. ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఉచిత శిక్షణ 2 నుంచి

పెడన రూరల్, మార్చి30(ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పరీక్షలు వ్రాసిన విద్యార్థులకు పాలిసెట్-2025 ఉచిత శిక్షణ తరగతులు నందమూరు వాసవీ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 2వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎన్‌వికె.ప్రసాద్ తెలిపారు. వివరాలకు 9440730562, 9390353504, 8247427885 సంపంరదించాలన్నారు.

కోడూరులో పోక్సో కేసు నమోదు

అవనిగడ్డ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : బాలిక పట్ల అనుచితంగా ప్రవర్తించిన వ్యక్తిపై కోడూరు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. బాలిక ఇంట్లో ఉన్న సమయంలో వరికూటి వేణు అనుచితంగా ప్రవర్తించాడు. బాలిక భయంతో ఇంటి నుంచి బయటకు పరుగులు తీసి తల్లికి విషయం చెప్పింది. పెద్దలు రంగ ప్రవేశం చేసి రాజీకి ప్రయత్నించటంతో రెండు రోజులుగా విషయం బయటకు పొక్కలేదు. ఆదివారం సాయంత్రం బాలిక బంధువులు కోడూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు ఎస్సై చాణిక్య తెలిపారు.

సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం

అవనిగడ్డ రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వేకనూరు ఉషా పద్మిని సమేత సూర్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం శాంతి కల్యాణం పాకలపాటి రామచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. తుంగల సుబ్బారావు - సంధ్య, అందె నాగరాజు - లక్ష్మీ ప్రసన్న దంపతుల కల్యాణం నిర్వహించారు. నాగరాజు - లక్ష్మీ ప్రసన్న దంపతుల ఆర్థిక సాయంతో అన్నసమారాధన నిర్వహించారు. తుంగల వీరవసంతరావు - ఇందిరా దంపతులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సామూహిక సత్య వ్రతాలు

అవనిగడ్డ రూరల్ : పులిగడ్డ షిర్డీ సాయిబాబా ఆలయంలో ఉగాది సందర్భగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. సామూహిక సత్యవ్రతాలు జరిపారు. సాయిప్రియాంక ఆధ్వర్యంలో భజన, అన్నసమారాధన నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు కెఎల్.నరసింహారావు, కెవికె. దుర్గారావు పర్యవేక్షించారు. పులిగడ్డలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉగాది వేడుకలు నిర్వహించారు.